14/3/2012

దైవంతో సంయోగం



అఖిల

అఖిల భారత పత్రిక

మార్చి 2012

14/2/2012.

దైవంతో సంయోగం

(1) వివరణ

(2) సలహా

(3) సంపూర్ణ సంయోగం

(4) సృష్టియొక్క కర్తవ్యము

సాధకుని అంతిమ లక్ష్యం

సాధకుని అంతిమ లక్ష్యం ఏమిటి? యోగి అగుట కాదా?

భగవంతునితో సంపూర్ణ సంయోగ మొందుటయే అంతిమ లక్ష్యం. వ్యక్తి ఒక నిరంతర సంయోగస్థితిని చేరుకోగలిగితే అతనిని యోగి అనవచ్చు. అయితే, ఆ సంయోగము పరిపూర్ణంగ వర్ధిల్లాలి. కొందరు యోగులలో ఈ సంయోగము ఆధ్యాత్మిక స్థాయికి మాత్రమే పరిమితమై ఉంటుంది. కొందరిలో మనసు, హృదయం కూడ మమేకమౌతాయి. మరి కొందరిలో వీటితోపాటు ప్రాణికము కూడ జోడవుతుంది. అయితే మన యోగములోని లక్ష్యం భౌతికచేతనలోను, దివ్యచైతన్యస్థాయిలో కూడ సంయోగము సాధించుట.

*

మానవునిలోని దైవాంశను వృద్ధిపరచుటయే ఆతని గురుతవ కర్తవ్యము. అధోస్థాయికి చెందిన ఆసురిక, రాక్షసిక ప్రవృత్తులను దివ్యప్రవృత్తులుగ మార్చుట మానవజీవనంలో నిక్షిప్తమైన అంతరార్థం. ఈ దైవాంశ వృద్ధిచెందుతున్న కొద్దీ అడ్డుతెర తొలగిపోతుంది. అంతరాత్మకు ఈ సృష్టిలోని అసలు వాస్తవికత ఏమిటో, దాని కర్తృత్వములోని పరమార్థమేమిటో విదితమౌతుంది.

మూలం: శ్రీఅరవిందులు (*SABCL* 23:508; *CWSA* 19:327; *SABCL* 13: 312-13)

*

భౌతిక ప్రపంచంలో బాధలకు, దుఃఖాలకు కారకం అవచేతనాగతమైన నిరాశావాదం. వీటిని అంతమొందించటానికి ఒకే ఒక మార్గముంది. దైవంతో పరిపూర్ణ సంయోగము, సమగ్ర దైవసాక్షాత్కారము. పరిపూర్ణ దైవసంయోగంలో మాత్రమే చేతన ఒక శాశ్వతమైన ఆనందంలోకి ఉప్పొంగుతుంది. ఈ చేతనాపూరక సంయోగమే ప్రాపంచిక జీవితం యొక్క యదార్థ గమ్యము.

మూలం: శ్రీమాత (*CWM* 16:427)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి



దైవంతో ఏకత్వం ఎందుకు?

ఈ విశ్వం దివ్యానందాతిరేకములో సృష్టించబడింది. దివ్యానందలబ్ధి కొరకే సృష్టించ బడింది. అయితే ఈ దివ్యానందము యొక్క ఉనికి కేవలం సృష్టి సర్వము సృష్టికర్తతో పరిపూర్ణంగ ఐక్యమొందినప్పుడే సాధ్యపడుతుంది. శ్రీఅరవిందులు ఈ కర్తృత్వాన్ని కర్తగా — అనగా సృష్టికర్తగా — తాను దేనిని సృష్టించాడో దాని చేతిలోనే చిక్కిన ట్లుగా, ఒక విధమైన పరస్పర ఆక్రమణగా — అదే ఏకత్వము యొక్క మూల తత్వంగా, సర్వానందమయస్థితికి మూలంగా, అభివర్ణించారు.

అయితే, పొందినవాడు ఆ పొందును కోల్పోయాడు, పొందబడినది పొందినవాడిని కోల్పోయింది. ఆ కారణంగా విభజన చోటు చేసుకుంది. అందువలన ప్రధానమైన దివ్యానందం అజ్ఞానంగ మారిపోయింది. ఈ అజ్ఞానమే సర్వ బాధలకు కారణమైంది. ఈ 'అజ్ఞానం' సర్వసాధారణ రీతిలో అర్థాన్నిచ్చే అజ్ఞానం కాదు. అందుకే శ్రీఅర విందులు దానిని 'అవిద్య' అని అంటారు. అవిద్య అజ్ఞానం యొక్క పర్యవసానం. నిజమైన అజ్ఞానం ఏకత్వం గురించిన ఎరుక లేకపోవుట — ఐక్యమగుట గురించి, అభేధ్యత గురించి ఎరుక లేకపోవుట. అన్ని బాధలకు అదే కారణం.

విభజన ఏర్పడినప్పటి నుండి, సృష్టి సృష్టికర్తతో తనకున్న ప్రత్యక్ష సంబంధం కోల్పోయినప్పటి నుండి, అజ్ఞానం అందలమెక్కింది. అన్ని బాధలు దాని ఫలితమే.

ఈ అంతరంగ అనుభవం పొందిన వారందరికీ, దివ్యమూలంతో పునఃసంధానం ఏర్పడినప్పటి నుండి, బాధలన్నీ అదృశ్యమౌతాయి. కాని అవిచ్ఛిన్నమైన కదలిక ఒకటి ఏర్పడుతుంది. దానిని గురించి గతవారం మీతో మాట్లాడాను. ఆ కదలిక సృష్టిమూలంలో ప్రధానమైన దివ్యానందానికి బదులు, కోరికను ప్రతిష్ఠించింది. ఈ సృష్టించుటలోని ఆనందాన్ని, స్వయంప్రకాశాన్ని, స్వయం అభివ్యక్తతను, ఒక ఆనందంగా కాక ఒక కోరికగా పరిగణించిన ఋషులు, తాపసులు ఎందరో ఉన్నారు. బౌద్ధమతావలంబకులంతా ఈ కోవకు చెందినవారే. ఆవశ్యకమైన ప్రత్యక్ష సాక్షాత్కారం మరియు పరివర్తనలోని దివ్యానందాన్ని పునఃప్రాప్తింపజేసే ఏకత్వంలో పరిష్కారం కనుగొనుటకు బదులు వారు గమ్యము, మార్గము కూడా కోరికలను పరిత్యజించుట మరియు నిర్వాణము అని నిర్ధారించారు. ఈ భావన ఒక విపరీత అపార్థానికి దారి తీస్తుంది. జీవన్ముక్తికి సిఫారసు చేయబడిన విధానాలు అభ్యున్నతికి అత్యంత ఉప

యుక్తమైనవి. అయితే ఈ ప్రపంచమంతా వాంఛాజనితమైనందున అది చెడుతో నిండి ఉన్నదని, అందువలన వీలయినంత త్వరగా ఎట్టి పరిస్థితులలోను దాని నుండి విముక్తి పొందాలి అనే భావన మానవజాతి చరిత్రలో ఆధ్యాత్మిక జీవనాన్ని యావత్తూ ఒక ఘోరమైన తీవ్ర వక్రీకరణకు లోనుచేసింది.

ఒకానొక కాలంలో అట్టి భావన ఉపయుక్తమై ఉండవచ్చు. కారణం, ప్రపంచ చరిత్రలో అన్ని విషయాలూ ఉపయుక్తమైనవే. కాని, ఆ అవసరం గడచిపోయింది. దాని కాలం చెల్లిపోయింది. మనము ఈ భావనను అధిగమించి అంతకు మించిన ప్రాధాన్యత కలిగిన మరింత ఉన్నతమైన పరమ సత్యం దిశగా మళ్లవలసిన సమయం ఆసన్నమైంది. సృష్టియొక్క దివ్యానందంలోకి, ఏకత్వంలోని ఆనందంలోకి, దివ్య సాక్షాత్కారంలోని ఆనందంలోకి తిరిగి ప్రవేశించవలసిన సమయం వచ్చింది. ఈ నూతన పరిణామం — కొత్తగా అనుభూతిలోకి వచ్చిన ఇహలోకజ్ఞానం — గత ఆధ్యాత్మిక పరిణామాలన్నింట స్థానే చోటు చేసుకోవాలి. దివ్య చైతన్య అనుభూతిని కలిగించే మార్గానికి దారి చూపాలి. అందుకనే కేవలం దివ్యానందమే, వాస్తవమైన దివ్యానందం మాత్రమే విజయం సిద్ధింపజేస్తుందని నేను గతవారం చెప్పాను.

ఈ దివ్యానందం అంటే ఏమిటి అనే దానిపై ఎలాంటి అస్పష్టత ఉండకూడదు. అందువలన శ్రీఅరవిందులు మొదటి నుంచీ మనలను జాగరూకులను చేశారు. వ్యక్తి భోగాలను అనుభవించుటలో ఆనందం పొందే స్థితిని అధిగమించినప్పుడే బ్రహ్మానందస్థితి అందుకోగలడని వక్కాణించారు. దివ్యానంద ప్రత్యేకానుభవం నుండి బ్రహ్మానందస్థితి ఖచ్చితంగా కలుగుతుంది. అయితే వేటిని మామూలుగ మనం సుఖసంతోషాలని అంటామో, వాటికి ఇది పూర్తిగా భిన్నమైనది. బ్రహ్మానందాన్ని పొందాలంటే వాటిని పూర్తిగా త్యజించాలి.

మూలం: శ్రీమాత (*CWM*: 9:7-9)

*

నీ అస్తిత్వము అనుసరించే అన్ని మార్గాలలోను సర్వోన్నతుడైన భగవంతునితో ఏకమవడమే యోగం. నీ అస్తిత్వము అనుసరించే అన్ని మార్గాలలోను సర్వము తానే యగు ఆ సర్వాంతర్యామితో ఏకమగుటయే యోగం. నీ ఆత్మశక్తి, నీ అవగాహన, నీ హృదయము, నీ సర్వేంద్రియాలు మానవజాతి యందు ప్రకాశిస్తున్న ఆ భగవంతునితో ఏకమగుటయే యోగం. దివ్యప్రకృతితోను, సమస్త జీవకోటితోను

ఏకమగుటయే యోగం. ఇదంతా ఆ భగవంతుని అతీతశక్తి సంపదతోను, ఆతడు నిర్మించిన జగత్తుతోను, ఆతడు తనయందు సృష్టించుకున్న సమస్త సముదాయము తోను ఏకమగుట కే. సర్వమూ ఆతని నుండే ఆవిర్భవించినందువలన, సర్వమూ ఆతనియందే ఉన్నందువలన, ఆతనే సర్వస్వమూ అయినందువలన, ఆతడే అన్నింటి లోనూ ఉన్నందువలన, ఆతడే నీ అధి ఆత్మగా భాసిస్తున్నందువలన, నీ ఆత్మశక్తి ఆతనితో మమేకమై ఉన్నందువలన, ఆతని అంశ ఒకటి నీ అంతరాత్మలో విరాజిల్లుతు న్నందు వలన, నీ ప్రకృతి అంతా ఆతని లీలావిలాసాలకు క్షేత్రమైనందు వలన, ఈ ప్రపంచమే ఆతని అస్తిత్వంలో ఒక రంగస్థలమై దానిలో ఆతడు నీ ఆంతరంగిక అధినాయకుడిగా, ప్రేమికుడిగా, స్నేహితుడిగా, ప్రభువుగా, రక్షకుడిగా, నీ సర్వస్వానికి లక్ష్యముగా నిలిచినందువలన, ఆతనితో ఏకత్వము నొందుట నీ అస్తిత్వము అనుసరించ దగిన రాజమార్గము.

మూలం: శ్రీఅరవిందులు (*CWSA* 12:333 Essays Divine and Human, pp. 349-50)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

భక్తుని మతం ఎప్పుడు యోగం అవుతుంది

పరిమితమైన మన కన్న, మృత్యువు వాతబడే ఈ జీవులకన్న మహనీయమైన, ఉన్నతమైన ఏదో ఒక పరాశక్తిని లేక అస్తిత్వాన్ని భావించుకొని దాని సంకల్పానికి, దాని ధర్మాలకు లేదా దాని అభ్యర్థనలకు విధేయమైన చింతనతో, ఆరాధనకు సంబంధించిన కర్మకాండతో ప్రతిమతం ప్రారంభమౌతుంది. ఆ విధంగా భావించబడిన, ఆరాధించబడిన, విదేయత చూపించబడిన పరాశక్తికి, ఆరాధకునికి మధ్య మతం తన తొలిదశలో ఇంతింతని చెప్పలేని అగాధాన్ని సృజించింది. తన పతాకస్థాయిలో యోగం ఈ అగాధాన్ని రద్దుచేస్తుంది. ఏలన యోగం అంటే సంయోగం, కలయిక.

*

వాస్తవానికి, ఇంకా దివ్యంగా తయారుకానటువంటి మనలోని మనస్సు తన లోపల దైవప్రేరణను, దైవం వైపు ఆకర్షణను సంవేదిస్తూ మానవ మనస్సు, మానవ అంతరంగం, తన మహనీయ అస్తిత్వాన్ని దేని ద్వారా కనుగొనగలదో, దాని వైపు

తిరగడమే యోగం, అదేదైనా సరే. భావావేశపరంగా చూస్తే ఈ తిరగడం అనేది ఉపాసన యొక్క మొదటి రూపం. మామూలు మతంలో ఈ ఆరాధన, బాహ్యాసంబంధమైన పూజాదికాల రూపంలో వుంటుంది. అది ఇంకా బాహ్యరూపం ధరించి కర్మకాండలతో కూడిన రూపాన్ని సంతరించుకొంటుంది. సాధారణంగా ఈ అంశం కూడా అవసరమే. ఎందుచేతనంటే జనబాహుళ్యం వాళ్ళ వాళ్ళ భౌతిక మనస్సుల్లో నివసిస్తారు. ఒక భౌతిక ప్రతీకకు సంబంధించిన ఏదో ఒకదాని శక్తి ఆధారం లేకుండా వాళ్ళు దేన్నీ నిజమనుకోలేరు. ఒక భౌతికకర్మకు సంబంధించిన శక్తితో గాక, మరి దేనితోనో మనుగడ సాగిస్తున్నట్లు వాళ్ళు తెలుసుకోలేరు. పశు లేదా భౌతిక అస్తిత్వపు జీవనమార్గాన్ని తన సాధనలో అత్యంత నిమ్నస్థాయిగా భావించి సాగే తాంత్రిక యోగసాధనలోని వర్గీకరణను మనం ఇక్కడ అన్వయింపజేయవచ్చు. పశువిధానాన్ని జంతువు లేదా భౌతికజీవిని తన సాధనా ప్రక్రియలో అత్యంత నిమ్నదశగా తాంత్రిక యోగం స్వీకరిస్తుంది. అది తన సాధనామార్గం యొక్క ప్రథమ సోపానంగా, కేవలం, లేక ప్రధానాంశంగా కర్మకాండతో కూడిన ఆరాధనను తీసుకొంటుంది. పూర్తిగా బాహ్యం వైపుకే చూచే ఈ ఆరాధన, మనస్సులో నిజంగా అనుభూతమైన దేనికో సంబంధించినదై వున్నపుడు, నిజాయితీగల విధేయత అయినపుడు, భక్తి నిండిన సంభ్రమం లేక ఆధ్యాత్మిక ఆకాంక్ష అయినపుడు మతం, అది నిజమైన మతమైనా సరే — యోగం మతం కంటె కూడా ఉన్నతమైనది — అపుడు ప్రారంభమౌతుందనేది స్పష్టం. అప్పుడది, దానికి సహాయకారి, బాహ్యవ్యక్తీకరణ అవుతుంది. అంతేగాక ఒక విధంగా సాధారణ జీవితపు వ్యావృత్తుల నుండి మనస్సును సదా వెనుకకు లాగడానికి అప్పుడప్పుడు లేక ఎల్లపుడూ గుర్తుచేయడం అవుతుంది. భగవత్తత్వం యొక్క ఏదో ఒక భావనకు మాత్రమే మనం భక్త్యారాధనలను నిర్వహిస్తున్నంత కాలం మనం యోగ ప్రారంభదశ దగ్గరకు కూడా పోలేదన్న మాట. సంయోగమే యోగలక్ష్యం గనుక ప్రారంభం నుండీ అది దైవాన్నే అన్వేషించాలి. ఏదో ఒక విధంగా దైవస్పర్శ కోసం, సాన్నిహిత్యం కోసం లేదా వశం చేసుకోవడం కోసం పరితపించాలి. ఇది మనకు ప్రాప్తించినపుడు ఉపాసన అన్ని సందర్భాల్లో ప్రాథమికంగా ఒక ఆంతరిక ఆరాధనగా మారుతుంది. మనం మనల్నే దైవానికి పవిత్ర ఆలయంగా చేసుకొంటాం. మన ఆలోచనలు, అనుభూతులు, సదా ఒక ఆకాంక్ష, అన్వేషణగా మారి మన జీవనమంతా ఒక బాహ్యసేవ మరియు ఆరాధనగా

మారుతుంది. ఈ పరివర్తన, ఈ నూతన అంతరాత్మ — వైఖరి వృద్ధిచెందుతూన్నకొద్దీ భక్తుని మతమే యోగంగా, అంతకంతకూ అధికమౌతున్న సంస్పర్శగా, సంయోగంగా తయారవుతుంది. అపుడు బాహ్యానికి సంబంధించిన పూజాదికాలను తప్పకుండా మానుకోవాలని లేదు. కాని అధికాధికంగా అవి కేవలం, ఒక భౌతిక వ్యక్తీకరణ లేక ఆంతర భక్తి, ఉపాసన, బాహ్యంలోనికి ప్రవహించడం అవుతుంది. మన పలుకులో, ప్రతీకాత్మక కర్మలో బయటివైపుకు సాగే ఆ ప్రవాహపు తరంగం అవుతుంది.

*

తత్త్వశాస్త్రంలా లేక బాగా ప్రాచుర్యం పొందిన ఒక మతంలా యోగం, ఒక సిద్ధాంతానికి లేక మూఢాచారానికి సంబంధించిన వ్యవహారం కాదు, అనుభవానికి సంబంధించిన విషయం. అది సచేతనమైన విశ్వజనీన, జగదతీత దివ్యపురుషునికి సంబంధించిన అనుభవం. యోగం మనకూ, ఆ పురుషునికీ సంయోగం కలిగిస్తుంది. దివ్యుడగు అగోచరునితో మన ఈ సంయోగం సదా తిరిగి తిరిగి నవ్యంగా పొందు తూండవచ్చు, ధృవీకరించుకొనవచ్చు. వేటి అగోచర మనస్సులతో మనం నిత్యం వ్యవహారం నెరపుతున్నామో ఆ భౌతిక ప్రపంచాన్ని గురించి, దృగ్గోచరమగువాటిని గురించి మనకుగల అనుభవమంత సచేతనమైన పటిష్టమైన అనుభవం యిది. సచేతన సంయోగం ద్వారా యోగం ముందుకు సాగుతుంది, సచేతన జీవి దాని ఉపకరణం.

మూలం: శ్రీఅరవిందులు (SABCL 21:528, 546-47;
CWSA 23:552, 571-72; 556-57)

అనువాదం: కె. వి. రావు

సత్యాన్ని నీ శక్తిగా చేసుకో.
సత్యాన్ని నీ రక్షణగా చేసుకో.
విజయానికన్నా సత్యానికై ఆసక్తి కనపరచు.

శ్రీమాత

యోగలక్ష్యం సంయోగం

యోగం అంటే సంయోగం. యోగం మొత్తం లక్ష్యం మానవాంతరాత్మ పురుషోత్తము నితో ఏకం కావడం. అంతేగాక ప్రస్తుత మానవ స్వభావం నిత్యునితో, సర్వోత్కృష్ట లేదా దివ్యపరాప్రకృతితో సంయోగం చెందడం.

*

కన్పించే ఆకారాలలో ఇంకెంత మాత్రం నివసించకుండా వాటన్నింటి వెనుక నున్న అభివ్యక్త దివ్యసత్యం లోనికి చేతనా పరివర్తన ద్వారా పయనించడం సమస్త యోగ లక్ష్యం. దానితో ఏదో విధమైన సంయోగం లేదా సన్నిహిత సంబంధం లోనికి ప్రవే శించడం లేదా అందులో పాలుపంచుకొనడం అనేది యోగా లన్నింటికీ సామాన్య లక్ష్యం.

*

సర్వోన్నతునితో, పరమాత్మ శక్తితో, పరమాత్మతో, దైవంతో లేదా ఆ ఏకైక శాశ్వతుని, అనంతుని మన మెంచుకున్న ఏ ఇతర నామంతోనైనా లేదా ఆతని అంశతోనైనా సంయోగాన్ని సాధించడానికి యోగం పెనుగులాడుతుంది.

దైవచేతనతో లేదా అనంతునితో సంబంధం సదా నిలుపుకొని అధికం చేసుకొన డాన్ని మొదట్లో సంయోగాని కర్థంగా చెప్పుకొంటాం. తరువాత దాన్ని మనలో జీర్ణించుకొంటాం లేదా మనం దానిలో జీర్ణమైపోతాం. ఆ తరువాత దానిలా అయి పోతాం, దానితో నిండిపోవడమే కాకుండా అందులో ప్రవేశించి అందులోనే నివసిం చడం, ఆ దివ్యచేతనగా, దివ్యజీవునిగా కావడం, దాని సారం యొక్క సారమై ఏ పరమ దివ్యత్వంలో నుండి మనం వెలువడ్డామో దాని నుండి మనలను వేరుచేయు సమస్తానికి ఉద్వాసన పలకడం

*

యోగలక్ష్యం శాశ్వతునితో ఏకం గావడం ఒక్కటే, మరితరమైన లక్ష్యమేదీ లేదు. ఎందుచేతనంటే ఈ ఒకే ఒక దివ్యసంసిద్ధిలోనే ఇతర లక్ష్యాలన్నీ చేరి వున్నాయి.

శాశ్వతునితో ఏకమై వుండడమంటే, అస్తిత్వంలో, చేతనలో, శక్తిలో, ఆనందంలో ఒకటై వుండడం. అనంతుని యొక్క ఈ నాలుగు పదాల్లో విషయమంతా సంక్షిప్తంగా చెప్పబడింది. ఎందుకనంటే తక్కినవన్నీ వీటి కార్యకలాపాలే.

శాశ్వతునితో ఒకటిగా వుండడమంటే, శాశ్వతునిలో, ఆతని సన్నిధిలో ఆతని అనంత ప్రకృతిలో — సాయుజ్య, సాలోక్య, సామీప్య, సాదృశ్య ముక్తిని పొంది జీవించడం గూడా. ఈ నాలుగూ కలిసి ఏకైక జీవన విధానం, ఏకైక సంసిద్ధి అవుతాయి.

శాశ్వతునిలో వసించడమంటే మనలోని శాశ్వతునితో నివసించడం గూడా. ఆ విధంగా సచేతనులై, ఎవరు ఆతని అస్తిత్వంలో ఆవాసం ఏర్పరచుకుంటారో, అతనిలో ఆతని చేతన గూడా నివసిస్తుంది. మనం యెప్పుడు భగవంతునిలో చరిస్తూ, కర్మ చేస్తుంటామో అప్పుడు ఆతడు కూడా మనలో కదలాడుతూ కర్మ చేస్తుంటాడు.

*

మన అస్తిత్వం మరియు సమస్తం యొక్క అస్తిత్వం దివ్యసత్యంతో సంయోగం చెందడం, యోగం యొక్క అత్యంత ప్రధాన లక్ష్యం. ఈ విషయాన్ని మనం మనసులో పెట్టుకోవలసిన అవసరం ఉంది. అతిమనస్సునే స్వాధీనం చేసుకొనడం కోసం మనం యోగాన్ని చేయడం లేదనీ, దైవం కోసమేననీ మనం గుర్తుపెట్టుకోవాలి. మనం అతిమనస్సుకై అన్వేషించేది అందులోని ఆనందం కోసం, గొప్పదనం కోసం గాదు. దైవంతో మన సంయోగం పరిపూర్ణమూ, సంపూర్ణమూ చేయడానికి, దానిని సంవేదించడానికి, వశం చేసుకొనడానికి, మన అస్తిత్వానికి సాధ్యమైన ప్రతి రీతిలోనూ, మన స్వభావపు అత్యున్నత ప్రగాఢతలలో, విశాల విస్తృతులలో, ప్రతి పరిధిలో, మలుపులో, మూలలో, రహస్యప్రదేశంలో, దానిని క్రియాశీలం చేయడానికి మనం అతిమనస్సుకై అన్వేషిస్తున్నాం. అతిమానసయోగం యొక్క లక్ష్యం, మానవాతీతమైన ఒక ప్రచండ బలసమన్విత అద్భుతస్థితిని, ఒక దివ్యశక్తిని, మహనీయతను అందుకోవడం, వ్యక్తిగత మూర్తిత్వాన్ని అనేక రెట్ల పరిమాణంలో హెచ్చించుకొనడం ద్వారా ఆత్మ-సాఫల్యతను సాధించడంగా భావించడం — చాలామంది అలా ఆలోచించడానికి అలవాటుపడ్డారు. కాని అది పొరపాటు. అది అసత్యమైన, మరియు ఘోరవిపత్తును కలిగించే భావన. ఘోరవిపత్తును కలిగించే దెందుకనంటే, అది గర్వాన్నీ, డాంబికాన్నీ, మనలోని రజోగుణ సంబంధ ప్రాణికమనస్సు యొక్క అత్యాశను పెంచే అవకాశముంది. ఒక వేళ దానిని అధిగమించ లేకపోతే, దాటి పోలేకపోతే, ఆధ్యాత్మిక పతనానికీ తప్పకుండా దారితీస్తుంది. అది అసత్యం, ఎందుకనంటే అదొక అహంకారిక అవగాహన. అతిమానస పరివర్తనానికి మొట్టమొదటి

షరతు అహాన్ని వదిలించుకోవడం. దృఢసంకల్పం, కార్యదక్షతగల మనిషికుండే క్రియాశీలమైన, చురుకైన స్వభావాని కది చాలా ప్రమాదం కలిగిస్తుంది. అది అతన్ని తేలికగా శక్తి కోసం ప్రాకులాడేటట్లు చేస్తుంది. అతిమానస పరివర్తన వల్ల శక్తి అనివార్యంగా ప్రాప్తిస్తుంది. పరిపూర్ణమైన కర్మ కదొక ఆవశ్యక నియమం. కాని పైనుండి దిగివచ్చి స్వభావాన్నీ, జీవితాన్నీ తన చేతుల్లోనికి తీసుకొనేది దైవశక్తి. ఆధ్యాత్మిక వ్యక్తి ద్వారా కర్మ చేసేది ఆ ఏకైకుని శక్తి. అనేక రెట్లుగా పెరిగిన వ్యక్తిగత శక్తి కాదు. అంతే కాదు, అది విభజనాత్మకమైన మానసిక, ప్రాణిక అహం యొక్క శిఖరాయమానమైన చిట్టచివరి సిద్ధి కాదు. ఆత్మ-సాఫల్యత యోగం వల్ల సిద్ధిస్తుంది. కాని దాని లక్ష్యం వ్యక్తి యొక్క గొప్పదనం కాదు. దాని ఒకే ఒక లక్ష్యం ఆధ్యాత్మిక సంసిద్ధి, నిజ ఆత్మను కనుగొనడం, దైవచేతనను, దైవప్రకృతిని తాను వహించడం ద్వారా అంటే సాధర్మ్య ముక్తి ద్వారా దైవంతో సంయోగం. మిగతాదంతా సందర్భానుసారంగా దానితోపాటు ప్రాప్తించేదే. అహాన్ని కేంద్రంగా చేసుకొన్న ప్రేరణలు, కీర్తికాంక్ష, అధికారం, గొప్పదనం కోసం తపన, తనను తాను గట్టిగా సమర్థించుకోవడం అనేవి ఈ మహత్తర చేతనకు పరదేశీయమైనవి. అతిమానస పరివర్తనం దగ్గరకు సుదీర్ఘకాలం తరువాతైనా సమీపించడానికి సంబంధించిన ఏ విధమైన సంభావ్యతనైనా వ్యతిరేకించే, దాటలేని అడ్డంకిగా అవుతాయవి. ఉన్నతాత్మను కనుగొనడానికి నిమ్నాత్మను వదలుకోవలసిందే. యోగం యొక్క ప్రధాన ఉద్దేశ్యం దైవంతో సంయోగం. స్వీయ అస్తిత్వం యొక్క, సమస్త అస్తిత్వాల యొక్క సత్యాన్ని ఆవిష్కరించుకొని ఆ సత్యంలో, మరియు దాని మహత్తర చేతనలో, జీవనంలోను, స్వభావంలోను పరివర్తనం అనేవి కూడా ఆ ఉద్యమం యొక్క సహజ ఫలితాలు మాత్రమే. ఆ ఉద్యమం యొక్క పూర్తి లక్ష్యసిద్ధికి అవి అనివార్య నియమాలు. అవి కేంద్రీయ లక్ష్యంలో భాగం మాత్రమే. ఎందుచేతనంటే అది తప్పక జరగవలసిన పరిణామం. అంతేగాక ఒక గొప్ప పర్యవసానం.

అతిమానస పరివర్తనం అనేది కష్టం, ఎంతో దూరాన వుంది. అదొక చరమదశ అనేది మన మనస్సులో వుంచుకోవాలి. మనోనేత్రానికి అందని చాలా చాలా దూరంలో ఉన్న చిట్టచివరి విషయంగా దాన్ని పరిగణించాలి; దాన్నే ప్రప్రథమ లక్ష్యంగా

చేసుకోలేం, చేసుకోగూడదు. సదా దృష్టిలో వుంచుకొనవలసిన గమ్యంగా లేదా మనం ఆలసించకుండా చేరుకోవలసిన లక్ష్యస్థానంగా కూడా పరిగణించకూడదు.

మూలం: శ్రీఅరవిందులు (*CWSA* 12:334-35, 331-33; 23:28-31)
అనువాదం: కె. వి. రావు

పరమ వేదాంతవిజ్ఞానం 'త్వమేవాహం'

యోగదర్శనమనేది కేవలం బౌద్ధికమైన భావన కానీ, సత్యాన్ని వెలికితీయడం కానీ కాదు. మన సత్త వివిధ వైఖరులలో జ్ఞానోద్దీప్త మానసికానుభవమూ కాదు. అది భావ స్ఫూర్తిపథమైన ఒక సిద్ధి. అది పరమాత్మను, ఆ అధిగమన దైవత్వాన్ని మనలో వాస్తవికం చేసుకోవడం. ఆ తర్వాత సత్త వివిధ వైఖరులను ఆ పరమాత్మ వెలుగులో చూడగలగడము. ప్రపంచంలో మన మానసిక, భౌతిక పరిస్థితులన్నిటిలో కూడా వాటి పద్ధతులన్నీ ఆ పరమాత్మ వెలుగులోనే ఉండాలి తప్ప వేరొక విధంగా ఉండటం అసాధ్యమవ్వాలి. ఇటువంటి సిద్ధిలో మూడు అనుక్రమణిక చర్యలు చోటు చేసుకున్నాయి. అవి అంతర్దృష్టి, సంపూర్ణ అంతర్గతానుభవం, స్వారూప్యము.

ఇంత జ్ఞానము, అనుభవమూ కూడా స్వారూప్యాన్ని చేరుకోడానికీ, పొందడానికీ కావలసిన ప్రాథమిక విధానాలు మాత్రమే. మనం చూసేదీ, అనుభవం పొందేదీ కూడా మన ఆత్మనే కాబట్టి స్వారూప్యత సాధించకపోతే అది అసంపూర్ణమే అవుతుంది. మనం సంపూర్ణంగా త్వమేవాహం అనే వేదాంత విజ్ఞానంతో జీవిస్తేనే అది సాధ్యము. మనం భగవంతుని చూసి ఆలింగనం చేసుకున్నంత మాత్రాన సరిపోదు. మనమే ఆ పరమ సత్యంగా మారాలి. రూపానికీ, వ్యక్తతకూ అతీతుడైన ఆ పరమాత్మతో ఏకం కావాలి; ఒక నిర్ణయంతో, ఉత్కృష్టతతో అహంకారాన్నీ తత్సంబంధిత వ్యాపారాలనూ తప్పించుకొని వాటి మూలస్థానమైన ఆ పరతత్వంలో ఏకం కావాలి. అంతే కాక పరమాత్మ వ్యక్తమైన అస్తిత్వాలు, అనురూపాలతో ఒకటి కావాలి. శాశ్వత అస్థిత్వంగా, చైతన్యంగా, ప్రశాంతతగా, మనలో ఆనందరూపంగా ఉన్న ఆ పరతత్వంగా మనం మారాలి. ఇంకా చేతలలో, రూపకల్పనలలో, ప్రపంచాన్ని కప్పి ఉంచుతున్న భావకల్పనా లీలలలో మనం భాగంగా అయిపోవాలి.

ఇది ఆధునికులకు అర్థం చేసుకోవడం కష్టమే. బుద్ధితో ఆలోచించకుండా ఆ పరమాత్మను తెలుసుకోవడమెలా అనేది వారి మనసుకి అందదు. అయితే అంతర్దృష్టితో ప్రకృతి పరిశీలన గావించడం ద్వారా ఈ విధమైన అనుభవాలకు సంబంధించిన ఛాయలు వారికి పట్టుబడ్డాయి. ఇటువంటి అనుభవాలను వారి ఊహలకి అందేటట్లు చేసినది వర్డ్సువర్తు అనే ఆంగ్ల మహాకవి. ప్రకృతి దర్శనాన్ని తానెట్లు పొందగలిగినదీ ఆ కవివరుడు రాసినది చదివితే మన ఊహకి కొంతవరకూ అందవచ్చు. ప్రధమంగా ప్రపంచంలో అన్నింటికీ మూలమై పనిచేస్తున్న చైతన్యశక్తిని ఆయన దర్శించినట్లు కనిపిస్తుంది. తన రూపానికి భిన్నంగా సకల రూపాలకూ ఆలవాలమై యుండి వాటిలో మళ్ళీ తాను అభివ్యక్తమవుతున్న శక్తి అది. ఈ విధమైన దర్శనాన్నీ, దాని ఉనికితో వచ్చిన శాంతినీ, విశ్వాత్మకతనూ, ఆనందాన్నీ పొందటమే కాక దాని మానసిక, రసాత్మక, ప్రాణిక, భౌతిక జ్ఞానాన్ని కూడా ఆయన పొందినట్లు కనిపిస్తుంది. దానికి స్వతహాగా ఉన్న ఈ జ్ఞానము, అంతర్దృష్టి కాకుండా సమీపంలోని చిన్న పుష్పంలో, సాధారణ మానవునిలో, స్థాణువుగా ఉన్న రాతిలో గూడా ఈ దర్శనాన్ని పొందాడు. చివరకు అడపాదడపా తనలో కూడా ఈ ఐక్యత పొందటం, తన ధ్యేయవస్తువుగా తాను మారటం అతని కవితల్లో చూస్తాము. 'నా ఆత్మ ఆమోదించిన సుషుప్తి' (A slumber did my Spirit Seal) అనే పద్య కవితలో ఇటువంటి ఘట్టాన్ని ఒకదానిని చాలా గొప్పగా, గంభీరంగా వివరించారు. తాను పుడమితో ఏకత్వం పొంది దాని నిత్యగమనంలో రాయిరప్పలతో, చెట్టుచేమలతో పల్టీలు కొట్టినట్లు వర్ణించారు. భౌతిక ప్రకృతికి మించిన ఉదాత్త పరమాత్మకు ఈ సిద్ధిని ఆపాదిస్తే, మనకు యోగ విజ్ఞానపు తత్వాలు తెలుస్తాయి. అయితే ఈ అనుభవమంతా ఒక నడవ లాంటిది; భావాతీతమైన అధిగమనత్వం చేరే అతీంద్రియ, అతిమానస సిద్ధికి మార్గము. ఇక ఈ విజ్ఞానపు శిఖరాగ్రం చేరాలంటే ఊర్ధ్వస్థ చేతనలో ప్రవేశించి వాచామగోచరుడైన సర్వేశ్వరునిలో సకల అనుభవాలను ఐక్యం చేయాలి. దివ్యజ్ఞానం పొందటానికి ఇది పరాకాష్ఠ. అదే దివ్య ఆనందానికీ, దివ్యజీవనానికీ మూలంగా అవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు (CWSA 23:304-07, SABCL 20-21: 290, 293)
అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామశాస్త్రి

భగవంతునితో ఐక్యతకు సాధనాలు

నిజంగా ఈ ఐక్యతకు తోడ్పడే సాధనాలు చాలా వున్నాయి. ఆకాంక్ష, సమర్పణ లేదా యితర మార్గాలు యెన్నో వుండవచ్చు. ప్రతి ఒక్కటి ఆ వ్యక్తి యొక్క స్థిరత్వము, చిత్తశుద్ధిని బట్టి దానికి మార్గం చూపిస్తాయి. భగవంతుని చేరుకోడానికి తీసుకునే నిర్ణయానికి వెనుక ఆకాంక్ష అత్యంత చురుకైన ప్రేరణతో నీ మొత్తం స్వభావాన్ని ముందుకి తీసుకెళ్తుంది. అయితే, సమర్పణ నీ అహం యొక్క అవధులను అర్పించేదిగా అభివర్ణించవచ్చు. భగవంతునికి సమర్పణ కావడమంటే నీ సంకుచిత పరిమితులను అర్పించి నీ ఆత్మ సర్వస్వం ఆ లీలకి కేంద్రంగా చేసి, దానిచే ఆక్రమింపబడాలి. కాని నువ్వొక విషయం మనసులో వుంచుకోవాలి. యోగులకు అత్యంత ప్రీతిపాత్రమైన సార్వత్రిక చైతన్యం పరమాత్మ కాదు. నీ కిష్టమైతే నీ పరిమితులను నువ్వు అడ్డంగా ఛేదించగలవు. కాని సువిశాల స్పృహ, విశ్వ బాహుళ్యం పరమాత్మగా భావించడం పొరపాటు. సార్వత్రిక చేతన సత్యాసత్యాల మిశ్రమం మాత్రమే. అందుచేత అక్కడితో ఆపివేయుట అసమగ్రమౌతుంది. ఎందుకనగా సర్వోన్నత సత్యం సాధించకుండానే, నువ్వు విశ్వచైతన్యంలో పాలు పంచుకోవచ్చు. ఇంకొక విధంగా, భగవంతుని వైపు పోవడం అంటే, సార్వత్రిక సిద్ధిని పొందడమే. అయినప్పటికీ నీవు అసత్యం నించి విముక్తి పొందగలవు.

సార్వత్రికతకి లేదా సర్వోన్నతికి ఆత్మార్పణ గావించుటకు ఆటంకం వ్యక్తికి తన పరిమితుల మీద వుండే ప్రేమే కారణం. అది సహజసిద్ధమైన ప్రేమ. ఎందుకనగా, వ్యక్తి యొక్క అస్తిత్వము ఏర్పడుటతోనే పరిమితులపై శ్రద్ధ కూడా ఏర్పడుతుంది. అది లేకపోతే వేర్పాటు భావం వుండదు. ప్రాణిక మానసిక చైతన్యంలో తరచు జరుగుతున్నట్టు యివన్నీ కలగలుపుగా వుంటాయి. ముఖ్యంగా శరీరం వేర్పాటు వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా జాగ్రత చేసుకోవడం చంచల స్వభావం వల్ల కాదు. కాని ఎప్పుడైతే ఒకసారి ఈ వేర్పాటు ధోరణి ఏర్పడిందో అది పోగొట్టుకుంటామేమో అన్న భయం అల్లుకుపోతుంది. ఇది చాలా విషయాలలో ఆరోగ్యకరమైన సహజ ప్రవృత్తి అయినప్పటికీ, భగవంతుడి మీద భక్తి పేరుతో తప్పుగా అన్వయించడం జరుగుతుంది. ఎందుకనగా, నిజానికి భగవంతుడిలో నీ వ్యక్తిత్వాన్ని నువ్వు ఎప్పటికీ కోల్పోవు. అహాన్ని మాత్రమే విడిచిపెడతావు. అప్పుడే నిజమైన వ్యక్తిగా దివ్యవ్యక్తిత్వ

మున్నవాడివిగా తయారవుతావు. సాధారణంగా నీవుగా పరిగణింపబడే భౌతిక చైతన్యనిర్మాణంలా అది తాత్కాలికం కాదు. ఒక్క దివ్యచైతన్యస్పర్శ తగలగానే తక్షణమే నీవు ఏమీ కోల్పోలేదని తెలుసుకుంటావు. శరీరానికి సంభవించే వంద మృత్యువులను ప్రాణిక మానసిక వికాసానికి అడ్డుపడే విషమ పరిస్థితు లన్నింటినించీ రక్షించగలిగేది ఏదైతే వుందో, ఆ సత్యమైన వ్యక్తిగత శాశ్వతత్వం పొందుతావు.

*

'సరైన మార్గంలో వుండడం' అని దేన్నైతే నేనంటానో అది చైతన్యస్థాయిలోనే వుంటుంది. దానిలో మాత్రమే దివ్యత్వంతో ఐక్యత యొక్క విలువ వుంటుంది. జీవించడంలో సార్ధకత ఈ ఐక్యతలో మాత్రమే. ఆకాంక్ష యొక్క పరమావధి అదే. మిగిలినదంతా వ్యర్థమే. విలువ లేనిదే. అందుచేత త్యజించిడమనేది ఏది ఉండదు. కారణం, కోరబడే విషయమంటూ ఏమీ లేదు కనుక.

భగవంతునితో ఐక్యత లక్ష్యంగా కాకుండా ఎంత కాలం జీవించినా ఆవ్యక్తి అంతవరకు సరియైన మార్గంలో లేనట్లే.

అతిముఖ్యమైనది, పరిగణించ తగినది ఏమిటనగా మీతో అధికాధికంగా, సంపూర్ణంగా ఏకం కావాలని, మా చైతన్యాన్ని మీ పరిపూర్ణ దివ్యచైతన్యంతో ఐక్యం చేయాలని, మీ సర్వోత్కృష్ట ధర్మానికి, మీ వాత్సల్య పూరిత ఇచ్ఛకీ. ఒక ప్రశాంత చిత్తము, సహనము, నిరపేక్ష తత్వంగల బలమైన సేవకులం కావాలనే, దృఢసంకల్పం.

మూలం శ్రీమాత

అనువాదం నడిమింటి విజయలక్ష్మి

సాధనలో సరైన అనుక్రమణము

ఆధ్యాత్మిక సత్యాన్వేషణకు, ఆధ్యాత్మిక జీవనము గడపడానికీ ముఖ్యోద్దేశ్యం దైవాన్ని కనుక్కోవడమే. అదొక్కటే ముఖ్యము, అది లేకపోతే ఇంకేమీ లేనట్లే. ఒక్కసారి ఆ దైవాన్ని కనుక్కున్న తర్వాత అభివ్యక్తం చేయాలి. అంటే ప్రధమంగా తన పరిమిత చైతన్యాన్ని దివ్య చైతన్యంగా పరివర్తింపచేయాలి; నిరవధికమైన ఆ ప్రశాంతతలో, వెలుగులో, ప్రేమలో, పటిమలో, చిదానందంలో జీవించాలి. పూర్తిగా తన స్వభావమే అలా మారిపోవాలి, దాన్ని నిలుపుకునే భాండంగా, ప్రణాళికగా, తన క్రియాశీలక చర్యలలో దాని సాధనంగా తయారవాలి.

అంతా ఒక్కటే అనే సూత్రాన్ని భౌతిక ప్రపంచంలో ప్రవేశపెట్టడం, మానవాళి కోసం పనిచేయాలనుకోవడం అనేవి సత్యానికి వక్రభాష్యం చెప్పడమే. ఇవేవీ ఆధ్యాత్మి కాన్వేషణకు ప్రథమ లక్ష్యాలు కాజాలవు. చిదాత్మనూ, ఆ దైవాన్నీ మొదట తెలుసు కుంటే ఆ తర్వాత ఆ చిదాత్మగానీ, దైవంగానీ మనం ఏం చేయాలని ఆదేశిస్తాడో తెలుస్తుంది. అంతవరకూ కూడా మన జీవితమూ, కర్మలూ అన్నీ ఆ దైవాన్ని కను క్కునే సాధనాలుగా ఉంటాయే తప్ప మరో ప్రయోజనమేమీ ఉండబోదు. అంతర్గ తంగా మనం చైతన్యవంతులమైన కొద్దీ, లేక భగవంతుని ఆధ్యాత్మిక సత్యం మనలో వర్ధిల్లుతున్నకొద్దీ, మన జీవితమూ, చేతలూ కూడా క్రమక్రమంగా అక్కడ నుంచే ప్రసరించి దానితో ఐక్యమైపోతాయి. అంతే తప్ప ముందుగా మన పరిచ్ఛిన్న మనోభావాలతో అవి ఉండవలసిన తీరును నిశ్చయం చేస్తే, లోపల జరిగే ఆధ్యాత్మిక అభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుంది. అది వృద్ధిపొందే కొద్దీ భగవంతుని వెలుగు, సత్యము, దైవబలము, శక్తి, దివ్యమైన పవిత్రత, ప్రశాంతత మనలో పనిచేస్తున్నట్లుగా తెలుసుకుంటాము. అది మన చర్యలను, చైతన్యాన్ని ఉపయోగించి మనలను దివ్యస్వరూపంగా మలిచే ప్రక్రియలో అక్కడున్న కల్మషాన్నంతా తొలిగించి దాని బదులు చిదాత్మ యొక్క మేలిమి బంగారం ప్రతిష్టిస్తుంది.

ఈ విధంగా ఎల్లవేళలా మనలో దైవ ప్రతిష్ట జరిగి మన చైతన్యం పరివర్తన చెందినప్పుడే భౌతిక ప్రపంచంలో భగవంతుని వ్యక్తం చేయటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పే అర్హత లభిస్తుంది. మనసులో ఒక ఆదర్శాన్నిగానీ, నియమాన్నిగానీ, నమ్ముతూ దాన్ని అంతర్గత చర్యలకు కూడా అన్వయించాలనుకుంటే మానసికసిద్ధి మాత్రమే

లభించే ప్రమాదముంది; దైవంతో అనుసంధానం, సంయోగం పొందేవరకూ అభివృద్ధిని కొనసాగనివ్వకుండా అర్థాంతరంగా అడ్డుపడటంగానీ, అసంబద్ధం చేయటంగానీ చేసి మన జీవితంలో ఆ భగవంతుని ఆత్మీయ సంకల్పం నెరవేరకుండా చేస్తుంది. ఈ కాలపువారి ఆలోచనలు ఈ విధంగా తప్పుడు అభ్యాసానికి మళ్ళే అవకాశముంది. అందువల్ల ఈ విధంగా అసలు కావలసినదాన్నుంచీ మనలను దారిమళ్ళించే స్వల్ప విషయాలపై మనసుపెట్టేదాని కంటే దైవసిద్ధితో లభించే శాంతి, వెలుగు, ఆనందాల కోసమే ఆయనను ఆరాధించడం మంచిది. ఆంతరిక జీవితంతో బాటు భౌతికజీవనాన్ని కూడా దివ్యమయం చేయడమే దైవప్రణాళికలో భాగంగా మనకు కనిపిస్తుంది. అయితే అంతర్గతమైన సిద్ధి బాహ్యంగా పొంగి పెల్లుబికితే మాత్రమే అది సాధ్యమవుతుంది తప్ప మనస్సు కల్పించిన సూత్రాలను అమలుపరచడం వల్ల జరగదు.

*

అహం నుంచి విముక్తి పొంది మనం మనంగా నిజస్వరూపం తెలుసుకోవడం ప్రథమ ఆవశ్యకత. దాని ప్రకాశమాన ఫలితంగా మిగతావన్నీ లభిస్తాయి; అది ఆవశ్యక పరిణామము. ఆ కారణంగానే ఆధ్యాత్మిక పిలుపు వచ్చినప్పుడు తప్పనిసరిగా శిరసావహించాలి. మిగిలిన అవిద్యా సంబంధిత బౌద్ధిక, నైతిక, సాంఘిక విధుల నన్నిటినీ పక్కన పెట్టి దీనికే ప్రాధాన్యత నివ్వాలి.

మొట్టమొదట ఆత్మావిష్కరణ అంటే బాహ్యంగా ఉండే ఆలోచనాభరిత ఉద్వేగ పూర్వక, కామనాపూర్వక సత్త కాకుండా చైత్యక అంశ, అంతర్గతమైన దైవ మూలాంశము. అది మన స్వభావాన్ని శాసిస్తున్నప్పుడు, మన ఆత్మ చైతన్యాన్ని పొందినప్పుడు, మనస్సు, శరీరము, ప్రాణము దాని పరికరాలుగా సముచిత స్థానాల్లో నిలిచినప్పుడు, సత్యాన్ని, మంచినీ తెలిసిన మార్గదర్శకుడు మనలో ఉన్నట్లుగా తెలుస్తుంది. ఆయనే అసలైన ఆనందం, సౌందర్యముగా తెలుసుకుంటాము. ఆయన తన భాస్వంత సూత్రంతో మన హృదయాన్నీ, బుద్ధినీ నియంత్రణ చేస్తూ మననూ, మన జీవితాన్నీ ఆధ్యాత్మిక పరిపూర్ణత వైపుగా నడిపించగలడు.

మూలం: శ్రీఅరవిందులు

(SABCL, 23:516-17; CWSA 21:653; SABCL 18:630, 631

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామశాస్త్రి)

విజయానికి మూలం

'ఇదే ప్రధానమైనది' అనే నిర్ణయానికి నీవు ఏనాడైతే వస్తావో ఆనాడే ఇది సంభవిస్తుంది. నీ జీవితంలో ఇంత ప్రాముఖ్యమైనది మరొకటి లేదనన్నీ, మిగతావన్నీ అనవసరమైనవి, పసలేనివి అనే భావంతో పాటు నీవు ఇందుకే జన్మించావని, దాన్ని ఇక్కడే, ఇప్పుడే సాధించవచ్చునని కూడా నీవు నమ్మాలి.

నీవు అనేక విషయాల మీద ఒకేసారి తదేకంగా దృష్టి నిలిపి ఉంచలేవు. కొన్ని సందర్భాలలో ఎంతో కాలంగా చేస్తున్న ధ్యానం వలన ఏ ఫలితం పొందనివాళ్ళు కూడా ఉన్నారు.

ఒక్కొక్కప్పుడు నీవు దేనిమీద ఆధారపడుతున్నావో అదే నిన్ను కుదేలుపడేలా చేస్తుంది. అప్పుడయినా దివ్యత్వాన్ని అంటిపెట్టుకుని ఉండటం తప్ప, వేరే మార్గం లేదని నీవు గ్రహిస్తావు. నీ ఆలోచనలు వాటంతట అవే ఆ మార్గంలో పయనిస్తాయి. నీ చేతన దివ్యచేతనగా మారే అవకాశం తప్పక వస్తుంది. కొందరు ఎన్నో మార్గాలు సూచిస్తారు. అది వారి విషయంలో కొంత ఫలితం ఇచ్చి ఉండొచ్చు. కాని ఎవరికి వారు తమకు సరిపోయిన మార్గాన్ని వారు ఎంచుకోవాలి. ఆ మార్గంలో ఉండే సాధక, బాధకాలు కొంతకాలానికి గాని అనుభవము లోనికి రావు. ముందే గ్రహించటం కష్టం.

ఒకవేళ ముందుగా రాబోయేది నీకు తెలిసినా, నీ మనసంతా అదే ధ్యాసలో ఉండి, అన్నింటిని వదిలేసి ఆ భ్రమలోనే ఉంటావు కూడా. ఒకవేళ నీ ఊహలే నిజమయి అవి సాధ్యాలుగా మారితే, అది నిజమైన అనుభవం అని భ్రమపడకూడదు. అది అసలు దాని ప్రతిబింబం కూడా కావచ్చు గదా! నన్ను అడిగితే ఈ ఆధ్యాత్మికానుభవాలు అన్నీ పొందిన తర్వాతే, వాటిని గురించిన జిజ్ఞాస ప్రారంభం కావాలి. ఇవి ఎట్లా ఉంటాయో, ఎప్పుడు జరుగుతాయో, ఎలా జరుగుతాయో తెలియనివాళ్లు ప్రశాంతచిత్తులై అంతర్మథనం చేస్తుంటే, ఉన్నట్లుండి ఈ అనుభవాలు ఎదురుకాను వచ్చు. అప్పుడు వాటిని గురించి తెలుసుకోనువచ్చు. మనకు అవి వచ్చిపోయిన తరువాతనే ఏం చేయాలో, ఎలా చేయాలో మన గ్రహింపులోనికి వస్తుంది. అదే అసలు విషయం.

*

ప్రశ్న: అమ్మా! 'యోగసమన్వయం' లో 'అనంతుని' కోరుకున్నవారినే, 'అనంతుడు' కూడా కోరుకుంటాడు అని ఉంది కదా?'

జవాబు: అది అద్భుతమైన వాక్యం. అదే అసలైన సత్యం. 'ఆలోచనలు — జ్ఞాపకాలు' అనే గ్రంథంలో 'అనంతుడు' అనే పదానికి బదులు 'దేవుడు' అని వ్రాసి ఉన్నది. కాని ఉద్దేశం మాత్రం ఒకటే. దేవుడు అన్నా, దివ్యత్వం అన్నా, అనంతుడు అన్నా ఒకటే కదా. ఆయన నిన్ను కోరుకోబట్టే కదా నీవు ఆయన దిశగా పయనిస్తు న్నావు. అదేగా నీకు ఆ విశ్వాసం కల్పించింది! నీవు అందుకోసమే జన్మించావని నిస్సంశయంగా తెలిసింది. ఏదో అన్ని అధిగమించలేని అవరోధాలు ఎదురైనా నీకు మాత్రం ఎదురు ఉండదు. విజయం నిన్ను తప్పక వరిస్తుంది. ఈ విశ్వాసమే మీ చేత అసాధ్యాలను సుసాధ్యం చేయిస్తుంది. అన్ని పరీక్షలను ఎదుర్కోవటానికి కావలసిన సహనాన్ని ఇస్తుంది. నీవు గెలిచి తీరుతావు.

పరమాత్మను నీవు తలచావంటే పరమాత్మ నిన్ను అనుగ్రహించాడని అనుకోవాలి. ఆయన సంకల్పించటం వలననే నీకు ఆ భావన జనించింది. ఎప్పుడైతే ఆ సంకల్పం నీకు కలిగిందో, ఎప్పుడైతే నీవు దీన్ని నీదైన సత్యంగా గుర్తించావో, ఆ క్షణమే అంతా జరిగిపోయినట్లే. కీకారణ్యంలో దారి తెన్ను కానక ఎన్నాళ్ళు దేవులాడినా ప్రయోజనం లేదు. అయితే కొందరు సూటిగా పయనించి త్వరగా గమ్యం చేరు తారు, కొందరు దారి, తెన్ను కానక ఆలస్యంగా చేరుతారు. కాని లక్ష్యం అదే. గమ్యం కూడా అదే. నా అనుభవంలో దైవం వైపుగా ఒక్కసారి తిరిగినవారెవరైనా వెనుకకు మళ్ళిన దాఖలాలు లేవు. కొన్ని అవాంతరాలు వచ్చి వారు వెనుదిరిగినా — చివరకు లక్ష్యాన్నే చేరుకున్నారు. కష్టాలు వస్తాయి, ఇబ్బందులు ఉంటాయి. కాని ఏదైనా లక్ష్యాన్ని మాత్రం చేరుకుంటావు. ఇట్టివారిదే 'దైవంచే కోరుకోబడిన ఆత్మ'. సమయం వచ్చినప్పుడు తన లక్ష్యాన్ని అది తెలుసుకుంటుంది. తెలుసుకు న్నాక వీలైనంత త్వరగా గమ్యాన్ని చేరుతుంది. ఇది క్షణంలోనా, యుగంలోనా, అనేక జీవితాలలోనా అనేది ముఖ్యం కాదు. గమ్యం చేరటం తథ్యం.

ఒక విషయం ఏమిటంటె ఒక జీవిత కాలంలో దీనిని సాధించాలనుకుంటే నీవు సాధించగలవు. కాని ఆ విధంగా చేయమని నేను నీకు సూచించటం లేదు. నీవు 'దీనిని చేయాల్సిందే' అని మెరుపుతీగలా సంకల్పించినా, అది ఆమోదం పొందినట్లే.

కాలయాపన వద్దు:

అడ్డదిడ్డ దారుల్లోనూ, చెత్త, చెదారంలోనూ పయనించాల్సి వచ్చిందన్న చింతే వద్దు. లక్ష్యం చేరుకున్నాక ఈ ఆలోచనలు ఎందుకు? కష్టాలు ఎన్నైనా రానీ, నిరుత్సాహపడవద్దు.

మీనమేషాలు లెక్కించేవాళ్ళు ఉండే ఉంటారు. శుభస్య శీఘ్రం.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

విజయ మంత్రం

విశ్వాసాన్ని ఆకాంక్షించుటయే కాక, మీ నుండి నేను కోరేదేమిటి? నీవు పాటించే పద్ధతిలో కొద్దిపాటి పరిపూర్ణత, పట్టుదల, అంతే! అలాగని, ఓ రెండు రోజులు ఆకాంక్షను పెంచుకుని, ఆ తర్వాత జర్మన్ ఫిలాసఫర్ అగు 'షొపెన్ హావర్' ప్రతిపాదిత నిరాశావాద విపరీత పరిణామాలను ఊహించుకుని నిస్పృహ చెందకు. దైవానికి ఒక సంపూర్ణ అవకాశం కల్పించు. నీలో అతడు ఏదో ఒకటి వెలిగించినా లేక ఒక జ్యోతిని ప్రజ్వలింప ప్రయత్నిస్తున్నా, దానిపై నిరాశ, నిస్పృహ అనే నీరు చల్లకు. 'అది కేవలం ఒక వెలిగించిన కొవ్వొత్తి తప్ప మరేమీ కాదులే!' అని అనుకుంటావు. కాని, ఈ విషయాల్లో మానవుని మనస్సును, ప్రాణాన్ని, దేహాన్ని ఆవరించిన చీకటిని తొలగించవలసినప్పుడు కొవ్వొత్తితోనే ప్రారంభించాలి — తర్వాత దీపం, ఆ తర్వాత సూర్యకాంతి అనుసరించవచ్చు. ప్రారంభమైనదానిని ఒక క్రమపద్ధతిలో ఎదగనివ్వాలి గాని సహజంగా కొనసాగుతున్న ఆ పరిణామాన్ని విచారము, సందేహము, నైరాశ్యత లాంటి అపశృతులతో కుంటుపడనీయ కూడదు.

మరింత సున్నితంగా చెప్పాలంటే — ఈ కార్యం నెరవేర్చడం తప్ప నీకుగాని ఈ లోకానికిగాని చేయవలసిందేమీ లేదు అని ఒక ఖచ్చితమైన నిర్ణయానికి రావాలి. ఇది చాలా క్లిష్టతరమైనది, దీర్ఘప్రయాసతో కూడుకున్నది, ప్రోత్సాహకము స్వల్పమైనది అని అనుకుంటావా? అయితే ఏమిటి? అంత గొప్ప కార్యం సులభంగా నెరవేర్చవచ్చని, అతి శీఘ్రంగా ఫలప్రదం కావాలని నీవెందుకు ఊహించాలి? కష్టాలు ఎదుర్కోవాలి, వాటిని ఎంత ఉత్సాహంతో ఎదుర్కొంటే అంత త్వరగా వాటిని అధిగమిం

చవచ్చు. చేయవలసిందల్లా ఒక్కటే. విజయమంత్రం అనుష్టించటం. గెలుపొందాలనే పట్టుదల, ఒక దృఢసంకల్పం కలిగి ఉండు. 'నేను దానిని పొందాలి, తప్పక పొందు తాను' అనే గట్టి నమ్మకం కలిగి ఉండు. అసాధ్యమా? అసాధ్యమనేది అసలు లేదు. కష్టాలుండవచ్చు, పరిష్కారానికి దీర్ఘకాలం పట్టే సమస్య లుండవచ్చు, కాని అసాధ్యమంటూ ఏదీ లేదు. ఏది చేయాలని ఖచ్చితంగా నిర్ణయించుకుంటే అది నేడో రేపో తప్పక నెరవేరుతుంది. అది సాధ్యమే. నైరాశ్యత అనే చీకటిని పారద్రోలు, ధైర్యంతో యోగసాధనతో ముందుకు సాగిపో. చీకటి కనుమరుగౌతున్నకొద్దీ అంతరంగ ద్వారాలు తెరచుకుంటాయి.

మూలం: శ్రీఅరవిందులు (SABCL 23:628-29)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

దివ్యచైతన్యంతో సంయోగం

ఏ శక్తి ఐతే అజ్ఞానంతో మిళితమైనప్పుడు ప్రాణికవాంఛగా రూపొందుతుందో, అదే శక్తి యొక్క స్వచ్ఛమైన లక్షణం దానిని పరివర్తన చెందటానికి అవసరమైన ప్రేరణను, బలాన్ని కూడ ఇస్తుంది. అందుచేత విశృంఖలంగా వాంఛాలోలుడవై, కోరికలను తృప్తిపరచవలసిన అవసరాలుగా భావించి, ప్రాణికశక్తి కీడు కలుగుజేస్తుందనే గట్టి నమ్మికతో దానిని తిరస్కరించే అపాయముంది.

నీవు చేయవలసిందల్లా, నీ అస్తిత్వపు ద్వారాలను దైవానికి పూర్తిగా తెరిచి ఉంచు. ఏదో దాచాలనుకున్న క్షణాన నీవు అసత్యములోకి అడుగిడినట్లే. ఏ విషయాన్నైనా కొద్దిమాత్రం అణిచిపెట్టినా అది నిన్ను అచేతనలో పడవేస్తుంది. నీవు సంపూర్ణ చైతన్యముతో ఉండాలంటే ఎల్లప్పుడు పరమసత్యమునే ధ్యేయంగా ఉంచుకో. నిన్ను నీవు ఆ పరమ సత్యానికి ఉన్మీలనము చేసుకొని అది నీ అంతరంగపు లోతుల్లోకి, నీ అస్తిత్వపు మూలమూలల్లోకి దృష్టి సారించగలిగేలా సాయశక్తులా ప్రయత్నించు. కేవలం అది మాత్రమే నీలోకి వెలుగును, చైతన్యాన్ని అత్యంత సత్యమైన దానినంతటిని కొనితేగలదు.

పూర్తి అణకువ కలిగి ఉండాలి: అనగా, నీవు ఏమిటో, నీవు ఏమి కావాలో, ఈ

రెంటికి మధ్యనున్న దూరం తెలుసుకోవాలి. ముతకబారిన నీ భౌతికమానసాన్ని, దానికి ఏమీ తెలియకపోయినా తనకంతా తెలుసునని అనుకోనివ్వరాదు, అది ధర్మాధర్మవిచక్షణ చేయలేకపోయినా, చేయగలనని అనుకోనివ్వరాదు. అణకువతో నుండుట అంటే నిన్ను నీవు దైవానికి మనఃస్ఫూర్తిగా సమర్పించుకొనుట, దైవసహాయం కోరుట, దైవానికి లొంగిపోవుట ద్వారా మనసునకు సంపూర్ణ ప్రశాంతతను సమకూర్చగలిగే స్వేచ్ఛను, బాధ్యతా విరమణను సాధించగలుగుట. ఆ విధంగా చేయలేకపోతే దివ్య చైతన్యంతోను, దివ్యసంకల్పంతోను సంయోగమును ఆశించలేవు....

అయినప్పటికి ఒక్కటి గుర్తుంచుకోవాలి. కేవలం నీ ఆలోచనకుగాని లేక నీ చర్యకుగాని పోలిక ఉన్నంతమాత్రాన సంయోగం సిద్ధించిందని రూఢి కాదు. అలాంటి దృష్టాంతాలు, పైపైన కనిపించేవి మాత్రమే. వాస్తవమైన సంయోగం ఒక సమగ్రమైన మార్పు, నీ సాధారణ చైతన్యము యొక్క పూర్ణప్రక్షాళన. దానిని నీ మనసులోనో లేక నీ మామూలు జాగ్రదావస్థలోనో పొందలేవు. దాని నుండి పూర్తిగా నీవు విడవడాలి — అంతవరకు నీవు దివ్యచైతన్యంతో సంయోగమొందలేవు. ఒక్కసారి ఆ సంయోగం నిజంగా అనుభవించగలిగితే, నీ ఆలోచన లేక నీ చర్య నా వాటితో పోల్చదగినవని రుజువు పరచాలనే నీ ఊహ నీకే నవ్వు తెప్పిస్తుంది. ఒకే ఇంట్లో ఏండ్ల తరబడి కలసి కాపురముంటున్న మనుషుల్లోనూ లేక ప్రతి రోజు పరస్పరం కలుస్తూ సన్నిహితంగా మెలిగే వారిలోనూ భావసారూప్యత ఏర్పడుతుంది. వారి ఆలోచన, ఆచరణశైలి ఒకే రకంగా ఉంటుంది. కేవలం ఆ విధమైన మానసిక సంబంధం ఏర్పడినంత మాత్రాన దైవత్వాన్ని ఆపాదించుకోకూడదు. నీ చైతన్యం పరిపూర్ణంగా ప్రక్షాళన గావించటానికి నీవు మనఃస్ఫూర్తిగా అంగీకరించాలి. వాస్తవ సంయోగానికి సంకేతం నీ చైతన్య లక్షణంగాని, అది పనిచేసే తీరుగాని దైవం మాదిరిగానే ఉండాలి, దివ్య జ్ఞానానికి మూలమైన దివ్యమానసము నుండే మొలకెత్తినదై ఉండాలి. కొన్నిసార్లు బాహ్యంలో నీవు దైవం మాదిరిగా నటించినట్లు కనిపించడం కేవలం కాకతాళీయం. అలాంటి పోలికలతో సంయోగాన్ని నిరూపించాలని అనుకోవడం కొండంత విషయాన్ని గోరంత ఉపమానంతో నిరూపించే ప్రయత్నంగా ఉంటుంది. వాస్తవ నిరూపణ ఏమిటంటే, నీవు ఏమి చేసినా అందులో దివ్యచైతన్యము యొక్క ప్రత్యక్షానుభవం పొందగలగడమే. అది ఒక స్పష్టమైన పరీక్ష. ఎందుకనగా, అది నీ అస్తిత్వాన్ని

పూర్తిగా మార్చివేస్తుంది. అంతమాత్రాన దివ్యచైతన్యం నీలో ప్రతిష్ఠింపబడినట్లు కాదు. కాని అది నీలో స్థిరపడక పూర్వమే, అడపాదడపా దాని అనుభవం నీవు పొందగలవు. దివ్యచైతన్యం ఒక్కోసారి కలిగి మాయమౌతుంటుంది, కాని ఆ సంయోగం కొనసాగుతున్నంత కాలం నీవు మరో మనిషిగా మారిపోతావు! ఈ లోకపు రూపురేఖలు కొత్త అందాలు దిద్దుకుంటాయి. నీవు స్వయంగానే కాక విషయాలపై నీకుండే అవగాహన, దృష్టి కూడ పరివర్తన చెందుతాయి. నీకు అనుభవసిద్ధి కానంతవరకు నిరూపణలకై వెతకాలనుకుంటావు; కాని, నిరూపణలు, ఫలితాలు ప్రధానం కాదు.

మూలం: శ్రీమాత (CWM 3:133-34)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

దివ్యసంకల్పంతో ఏకీభావము

నీవు నిజంగా దైవకార్యాలు చేయాలనుకుంటే నీవు సాధించాల్సిన ప్రథమ లక్ష్యము ఏమాత్రము స్వాతిశయము, కోరిక లేకుండా చేసుకోవడమే. తర్వాత దివ్యచైతన్యాన్ని వృద్ధి చేసుకోవడము. ఆ చైతన్యము ఎలా ఉండాలంటే నీ సంకల్పానికీ, శ్రీమాత సంకల్పానికీ తేడా ఏమాత్రం ఉండకూడదు; నీలో ఆమె ప్రచోదన తప్ప మరే ప్రేరణా రాకూడదు; ఆమె చేతనాత్మక చర్య తప్ప మరే చర్య కూడా నీలోనూ, నీ ద్వారానూ జరగకూడదు.

...దివ్యశక్తి నిన్ను ప్రబోధించి దారి చూపడమే కాక, ప్రారంభించి కొనసాగేటట్లు చేయడం నీవు ఏదో ఒక రోజున గమనిస్తావు; నీ చలనాలన్నీ ఆమె కల్పించినవే, నీ శక్తులన్నీ ఆమెవే; నీ మనసు, ప్రాణము, శరీరము కూడా ఆమె చర్యలకు వాడుకునే ఉల్లాసభరిత సాధనాలు; ఆమె లీలలకు కావలసిన ఉపకరణాలు, భౌతిక ప్రపంచంలో ఆమె వ్యక్తం అవాలనుకున్నప్పుడు కావలసిన నమూనాలు.

ఈ పరిపూర్ణత చరమస్థాయి చేరడం నీవు పూర్తిగా దివ్యమాతతో సారూప్యత పొందినప్పుడే. అప్పుడు నీవు విడిగా ఉన్నావనీ, భిన్నవ్యక్తివనీ, ఒక పరికరానివనీ, పనివాడివనీ భావించవు: నిజంగా ఆమె బిడ్డవనీ, అనాదిగా ఆమె చైతన్యంలోనూ,

శక్తిలోనూ భాగంగా ఉన్నావని భావిస్తావు. సదా ఆమె నీలోనూ, నీవు ఆమెలోనూ ఉంటావు. నీ ఆలోచన, దృక్పథం, నీ పనులు, చివరకు నీ శ్వాసలూ అన్నీ ఆమెవిగా, ఆమె నుంచి వస్తున్నట్లుగా ఒక సరళమైన, సహజానుభవం నిరంతరం నీకు కలుగుతూ ఉంటుంది. ఇంకా ఆమె తనలో నుంచి మలిచిన ఒక వ్యక్తివీ, శక్తివీ అనీ ఆమె విలాసం కోసమే వెలువడినవాడివనీ, అయినా సురక్షితంగా సదా ఆమె ఉనికిలో ఉనికిగా, చైతన్యంలో చైతన్యంగా, ఆమె శక్తిలో శక్తిగా, ఆనందంలో ఆనందంగా ఉంటున్నావని నీవు గ్రహిస్తావు. ఈ స్థితి ఎప్పుడైతే సాకల్యంగా పూర్తి అయి ఆమె అతిమానసిక శక్తులు స్వేచ్ఛగా నిన్ను కదిలించగలవో అప్పుడు నీవు దైవకార్యాలలో పరిపూర్ణత్వం పొందుతావు. నీ జ్ఞానము, సంకల్పము, చేతలూ అన్నీ స్పష్టంగా, సరళంగా, ప్రకాశమానంగా, స్వతసిద్ధంగా, స్వచ్ఛంగా పరబ్రహ్మం నుంచీ జాలువారుతవి. అనంతత్వంలో అదొక చలనము.

మూలం: శ్రీఅరవిందులు (SABCL 25:15-18)

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామశాస్త్రి

తాదాత్మ్యత పరిపూర్ణమే కాని పాక్షికం

ప్రశ్న: మాతా, ఒక వ్యక్తి దైవంతో తన ఉన్నత అస్తిత్వంతో తాదాత్మ్యం పొందుతూ, అదే సమయంలో నిమ్నభాగాలను తృణీకరించినట్లయితే — జీవితాన్ని తృణీకరించినట్లయితే — అప్పుడు దైవం ఏ భాగంలో ఆ వ్యక్తి తాదాత్మ్యం చెందుతున్నాడో, ఆ సమయంలో నిమ్నభాగాలను సైతం తాదాత్మ్యతకు సిద్ధం చేయమని అతనికి సలహా నివ్వడా?

సాధనారంభంలోనే అతడు అది జరగకూడదని కచ్చితంగా నిర్ణయించుకుని ఉండినట్లయితే, అతడు బహుశా తనకు తానుగా దైవం సలహాను అందుకోవడాన్ని అసాధ్యం చేస్తాడు!

కారణం, నిజంగా చెప్పాలంటే ప్రతి వ్యక్తీ కేవలం తాను దైవాన్ని ఏ విధంగా దర్శించాలనుకుంటాడో అదే విధంగా దర్శిస్తాడు. శ్రీఅరవిందులు దీనినే మరొక విధంగా చెప్పారు; వారేమన్నదీ, నేను సరిగ్గా వారు వాడిన పదాలనే చెప్పడం లేదు, భావం మాత్రం చెపుతున్నాను: నీవు దైవం నుంచి ఏమి అపేక్షిస్తావో దానినే

దైవంలో కనుగొంటావు; నీవు దైవం నుంచి ఏమి కోరుకుంటావో దానినే దైవంలో పొందుతావు. నీ కోసం ఆయన నీ అపేక్ష లేక కోరికలకు అనుగుణంగా ఉంటాడు.

అది ఎల్లప్పుడూ, ఆయన అభివ్యక్తత అందుకోగలిగిన దానిని బట్టీ, సమర్థతను బట్టీ వారికి అనుగుణంగా మలచుకోబడుతుంది. వారు వాస్తవమైనదానినే, ఆవశ్యకమైనదానినే స్పృశించవచ్చు, కాని ఈ స్పర్శ వారి సామర్థ్యాన్ని బట్టి అందుకునే విధానాలలోనూ, దానిని సమీపించడంలోనూ పరిమితమౌతుంది.... పూర్తిగా పరిమితులన్నింటినీ దాటిపోగలిగినప్పుడే నీవు సంపూర్ణ దైవాన్ని ఆయన సంపూర్ణంగా ఉన్న పద్ధతిలోనే కలుసుకోగలుగుతావు.

ఈ విధంగా స్పృశించగల సామర్థ్యమే బహుశా జీవులన్నింటిలో యదార్థమైనటువంటి విభిన్నస్థాయిల వ్యవస్థీకరణకు దోహదమవుతున్నది. ఎందువల్లనంటే, ప్రతివారూ దైవాన్ని తమలో కలిగి ఉంటారు, ఆ విధంగా ప్రతివారూ దైవంతో ఐక్యమయే సంభావ్యతను కలిగి ఉంటారు — ఆ సంభావ్యత అందరిలోనూ ఒకే విధంగా ఉంటుంది. కాని ప్రతివాని యొక్క సామర్థ్యాన్ని బట్టి — వాస్తవానికి, దైవంలోని విభిన్న శ్రేణులలో వాని స్థానాన్ని బట్టి — అతను దైవాన్ని చేరడం ఎక్కువగానా లేక కొంచెం పాక్షికంగానా లేక సంపూర్ణంగానా అనే విషయం ఆధారపడి ఉంటుంది.

ఈ మాటలన్నీ విషయాన్ని చాలామటుకు పెడదారి పట్టిస్తాయి, కాని ఏ విధంగా చెప్పవచ్చంటే, దైవాన్ని చేరే విధానం ప్రతి జీవికీ ఒకే రకంగా ఉంటుంది, కానీ, మోతాదులో, సంపూర్ణతాపరంగా తేడా ఉంటుంది.... దీనిని మాటలలో వ్యక్తీకరించడం చాలా కష్టం, కాని చెప్పటానికి మాత్రం, దైవంతో నీవు తాదాత్మ్యత నొందే స్థానం దానికది పరిపూర్ణమే. అది ఆ స్థానానికే పరిమితం, కాని వివిధ స్థానాలలో నీ తాదాత్మ్యత చాలా ఎక్కువగా భేదిస్తుంది.

దైవాన్ని చేరడానికి అనుసరించే వివిధ మార్గాలలో ఈ తేడా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సాధారణంగా మానవులే పరిమితులను పెట్టుకుంటారు; వారు ఎంచుకున్న దానికి కచ్చితంగా సరితూగని సాధనామార్గాలన్నింటిని మినహాయిస్తూ వారే పరిమితిని విధించుకుంటారు, ఎందువల్లనంటే, అది సులభం. అంతేకాక, వారు ఇతర విధానాలతో పోల్చిచూచుకుని చాలా ముందుకు పోగలమనే భావనతో ఉండడం. కాని, ఒక దారిగుండా ప్రయాణించడానికి బదులు, సమస్తమును కలుపుకుని పోయేటటువంటి, దైవాన్ని చేరే అన్ని సాధ్యాలను కలిగినటువంటి గోళాకారంతో ఉంటుందని చెప్పబడే

ఒక దారిలో ముందుకుపోతే, సహజంగానే ఫలితం సంపూర్ణంగానే ఉంటుంది — దీనినే శ్రీఅరవిందులు పూర్ణయోగమని చెప్పారు — కాని, ఇందులో పురోభివృద్ధి ఎంతో ఎక్కువ కష్టసాధ్యమే కాకుండా చాలా నిదానము.

జ్ఞానమార్గాన్ని ఎంచుకున్న వ్యక్తి — ఆ జ్ఞానమార్గంలో కూడా ప్రత్యేక విధానం అనుసరిస్తాడు, ఎందువల్లనంటే ప్రతివారికి వారి వారి ప్రత్యేక పద్ధతి ఉంది — దాని అనుసరణలో తన చైతన్యం నుంచీ, జీవితం నుంచీ అది కానిదాని నంతటిని మిన హాయించుకుంటూ పోతాడు. ఆ విధంగా చాలా ఎక్కువ వేగంతో ముందుకు సాగిపోతాడు, ఎందువల్లనంటే, అతడి అన్వేషణ కేవలం ఒక భావం మీద మాత్రమే నిమగ్నమవటం మూలంగా. ఇది ఎంతో ఎక్కువగా, సూటిగా ఉండటమే కాకుండా, సత్వర ఫలితాన్నిస్తుంది. కనుక అతడు తిరస్కరిస్తూ, తిరస్కరిస్తూ, దీనికి వ్యతిరిక్త మైనదానినల్లా తిరస్కరిస్తూ ఉంటాడు. ఆ విధంగా తన అస్తిత్వాన్ని తాను ప్రయా ణించే మార్గానికి పరిమితం చేసుకుంటాడు. నీవు చేరదలుచుకున్నది సమగ్రంగా ఉండాలంటే, సహజంగానే అది ఎక్కువ కష్టసాధ్యమైనదే అవుతుంది, అది చాలా చిక్కుముడులతో దీర్ఘకాలం పట్టడమే కాకుండా, శ్రమతో కూడినదవుతుంది.

కాని కేవలం ఒకే మార్గాన్ని అనుసరించే వ్యక్తికి, తన లక్ష్యం చేరుకోగానే, అనగా దైవంతో తాదాత్మ్యత నొందగానే, అతని తాదాత్మ్యత దానికది పరిపూర్ణమే అవుతుంది; వాస్తవంగానే అది దైవంతో తాదాత్మ్యత అని నిస్సందేహంగా చెప్పవచ్చు — కాని అది పాక్షికం. అది సమగ్రమే; సమగ్రమే కాని అదే సమయంలో పాక్షికం.

దీనిని వివరించి చెప్పడం చాలా కష్టం, కాని అది సత్యం. అతడు దైవంతో యదార్థంగా తాదాత్మ్యతను చెందాడు, అతడు దైవాన్ని కనుగొన్నాడు; అతడు దైవంతో తాదాత్మ్యతను అనుభవించాడు — కాని అది ఒక స్థానంలో మాత్రమే కనుక ఒక వ్యక్తి తనకు తాను సంపూర్ణంగా దైవంతో తాదాత్మ్యతను పొందగలగాలంటే, తప్పనిసరిగా, సార్వజనీన సాక్షాత్కార దృక్పథంలో, ఒకే స్థానంలో ఆయనను సాక్షాత్కరించుకునేవాని కంటే అతడు చాలా ఉన్నత స్థాయిలోని శ్రేణికి చెందినవాడై ఉండాలి.

ఇదే ఆధ్యాత్మికపరమైన విభిన్న శ్రేణులకు సరైన అర్థం. అందువలననే మొత్తం ఆధ్యాత్మిక విభిన్న శ్రేణుల వ్యవస్థ రూపుదిద్దుకుని యున్నది. లేని పక్షంలో దానిని బలపరచడానికి కారణాలు లేవు. ఎందువల్లనంటే, నీవు దైవాన్ని స్పృశించిన క్షణం

నుంచీ, నీవు సమగ్ర స్పర్శనే పొందుతావు. ఏ స్థానంలో పరంధాముని స్పర్శను పొందుతావో అక్కడ అది పరిపూర్ణమే. ఈ దృక్పథంలో, దైవంతో ఐక్యత నొందిన వారంతా సమానంగా పరిపూర్ణ సంయోగం కలిగినవారే అవుతారు. కాని, నన్నడిగితే, సమానంగా పూర్తి ఐక్యత నొందినవారు కారు.

నేను చెప్పినదానిలో కొంతైనా అర్థం అయిందా?

ప్రశ్న: మాతా, నేను అడగదలచుకున్నది ఇది, వారు దైవంతో తాదాత్మ్యం చెందిన తరువాత వారు తాదాత్మ్యత చెందిన స్థానంలో, వారి తాదాత్మ్యత సంపూర్ణం కాలేదని గ్రహించగలుగుతారా? దానర్థం, వారు తమ అస్తిత్వంలో ఇతర భాగాలను వదలివేశామనీ, మళ్ళీ సాధనను అవశ్యం మొదలు పెట్టవలసి ఉందని గ్రహిస్తారా?

ఇది జరగవచ్చు కాని, సర్వసాధారణంగా వారు తాము ఎంచుకున్నది కాని దాని నంతా తమలో నుంచి తొలగించివేసి ఉండడంతో, వారికింక సాక్షాత్కారం చేసుకోవడానికి పరిపూర్ణంగా లేనిదంటూ ఏమీ ఉండదు. వారికి తాదాత్మ్యానుభవం వచ్చింది, వారు దైవంలో లీనమైపోయారు. ఆ వ్యక్తికి, ప్రత్యేక వ్యక్తిగత దృక్పథం ప్రకారం, వారు ఆశించగలిగిన అత్యంత మహత్వం అది.

నీవు అంటున్నది అసాధ్యమేమీ కాదు, వాస్తవానికి నేను సాధ్యమనే అనుకుంటున్నాను — కాని అది చాలా అరుదు. అది తరచుగా జరిగేది కాదు. దానర్థం, వారు శ్రమపడి తొలగించివేసినప్పటికీ వారి చైతన్యంలో దానికి సంబంధించినదేదో ఉంచుకున్నవారవటం మూలంగా వారు పూర్తిగా సంతృప్తిచెందని అనుభూతిని పొందగలిగేటట్లు చేసింది.

తాదాత్మ్యం తరువాత, అక్కడ ఎటువంటి స్థాయిలు ఉండవు, ఉదారహరణకు గురువు-శిష్యుడు, పరమాత్ముడు-భక్తుడు. తాదాత్మ్యతాక్షణాన ఆ సంబంధం అదృశ్యమౌపోతుంది.. ఇక ఏమాత్రమూ గురువు లేక శిష్యుడు, పరమాత్ముడు లేక భక్తుడు అనేది లేదు: అంతా దివ్యమే. అటువంటప్పుడు, బోధ స్వీకరించేదెవ్వరు? అది ఎప్పుడు జరుగుతుందంటే కేవలం తాదాత్మ్యంలో పాలుపంచుకోని చైతన్యభాగం ఉన్నప్పుడే. దానికి కారణం అది పొందిన పద్ధతిలో కాక మరొక మార్గంలో పొందవలసిన అవసరం ఉండటం మూలంగానే. అది అంతా ఎంత సమగ్రంగా సాధకుడు తన అస్తిత్వం నుంచి తాను అనుసరించే ప్రత్యేక పథానికి ఏమాత్రం సంబంధించనిదాని

నంతా తొలగించివేశాడనే దానిమీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, అతడు తన చైతన్యంలో ఎక్కడో ఒక చోట, ఆరాధనకు లేదా ప్రేమకు సంబంధించినవాటిని ఉంచుకుని, జ్ఞానమార్గాన్ని అనుసరిస్తే, తాదాత్మ్యం పొందే క్షణాన ఇవి ఏదో పొందలేదనుకుంటాయి. అప్పుడతనికి తన అనుభవం సంపూర్ణం కాదని అర్థం చేసుకోగలుగుతాడు. కాని వాటిని మూలం నుంచి తొలగించివేస్తే, అప్పుడు సంయోగం సమగ్రం కాదని ఎవరు తెలుసుకోగలుగుతారు? ఆ ప్రత్యేక స్థానంలో సంయోగం తనకు తాను పరిపూర్ణమే. ఇది పూర్తిగా చైతన్యానికి చెందిన ప్రక్రియ.

(పిల్లవాని వైపు తిరిగి) నీ చైతన్యంలో నీకంటె ఎక్కువ తెలిసిన 'ఒకానొక మహత్వ' మైన దానితో ఏకం అవుతావని, అది నీకు నీ తప్పిదాన్ని గుర్తించేటట్లు చేస్తుందనే భావన ఇంకా ఉన్నట్లే ఉన్నది. కాని అది తాదాత్మ్యం పొందిన తరువాత ఎంతమాత్రం ఉండదు! అప్పుడది మొదటి స్పర్శే అవుతుంది కాని తాదాత్మ్యత కాదు.

తాదాత్మ్యంలో, తాదాత్మ్యం చెందినవాడికీ, అతడు దేనితో తాదాత్మ్యం చెందాడో దానికి మధ్య బేధం ఉండదు. అంతా ఒకటే. వ్యత్యాసం ఉన్నంతవరకు, అది తాదాత్మ్యం కాదు.

నేను చెప్పేదేమిటంటే మార్గం ఏదైనా కానీ, ఆ మార్గానికి సంబంధించినవన్నింటినీ తొలగించివేసినప్పుడు, ప్రతి వ్యక్తికీ దైవంతో పరిపూర్ణమైన తాదాత్మ్యత సాధ్యమౌతుంది, అనగా, దైవం అయిపోవడం — కాని అది జరిగేది ఒకే ఒక స్థానంలో, అతడు ఎంచుకున్న స్థానంలో. ఆ స్థానంలో దానికది సమగ్రమే. కాని అది సమస్తాన్ని కలిగి ఉంటుందని నేను చెప్పడం లేదు. నేనేం చెప్తున్నానంటే అది తనకు తాను స్వయం పరిపూర్ణం, అంటే తాదాత్మ్యం సమగ్రం — కాని అది సంపూర్ణం కాదు.

*

ఆవశ్యకమైన విషయం ఏమిటంటే, దైవంతో ఈ ఏకత్వాన్ని, నీవు ఆయనను చేరడానికి ఉపయోగించే అన్ని ఆకృతులలోనూ, అన్ని దృక్పథాలలోనూ, అన్ని మార్గాలలోనూ చూడగలగాలి. నీవు వాటన్నింటిని అవశ్యం దాటిపోయి కొత్తమార్గాన్ని కనుగొనాలి.

కనుక నీ ఆలోచనలలో నుంచి తుడిచివేయవలసిన మొదటి విషయం, అది అత్యంత ప్రధానమైన విషయం: నీవు పూర్ణయోగాన్ని ఇతర ఆధ్యాత్మిక సాక్షాత్కారాలతో కలిపి గందరగోళపరచవద్దు. అవి చాలా ఉచ్చతమమైనవే కావచ్చు, కాని

అవి పరిమితమైన క్షేత్రానికి మాత్రమే చెందినవై ఉంటాయి, ఎందువల్లనంటే వాటి గమనం కేవలం లోతుకే పరిమితం.

నీ ఆకాంక్షతో ఎందులోనైనా లోతుకు వెళ్ళి ఒక ఛిద్రాన్ని చేయవచ్చు. ప్రతిదీ నీ ఆకాంక్ష యొక్క తీవ్రత, చిత్తశుద్ధి మీద ఆధారపడి ఉంటుంది. చిత్తశుద్ధి అనగా, నిన్ను నీవు పరమాత్మకు సమర్పించుకోవటం ఎంతమటుకు పూర్ణం, పరిపూర్ణం, సంపూర్ణం. కాని అది నీవు ఎంచుకున్న ఆకృతి మీద ఆధారపడి ఉండదు, తప్పనిసరిగా దాని వెనుక ఏముందో తెలుసుకోవాలంటే దాని గుండా పోవలసిందే.

కాని నీ ప్రకృతినీ, అస్తిత్వాన్నీ పరివర్తన చేయాలన్నా, నీవు నవీన ప్రపంచసృష్టిలో పాల్గొనాలన్నా, అప్పుడు ఈ ఆకాంక్షా, ఈ తీక్షణతా, ఒకే రేఖ మీద సమాంతరంగా సాగిపోవడమనేవీ ఎంతమాత్రమూ సరిపోవు. వారు ప్రతిదానినీ అవశ్యం చేర్చుకోవాలి, వారి చైతన్యంలో ప్రతిదానినీ అవశ్యం కలిగి ఉండాలి.

మూలం: శ్రీమాత (CWM 8:44-48; 244-45)

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

సమగ్ర అనుభవం — సమగ్ర పరివర్తన

ఆధ్యాత్మిక సంసిద్ధి, అనుభూతితో సామరస్య సందీప్త సమగ్రత్వం పూర్ణయోగ లక్ష్యం. అందుకే దానికా పేరు. పారమార్థిక సత్యాన్ని సర్వసంపూర్ణంగా, సర్వసమ గ్రంగా అనుభవంలోకి తెచ్చుకోవడమే ఈ యోగం లక్ష్యం. దీనినే భగవద్గీత 'సమగ్రమ్ మామ్' అని వర్ణించింది. పరమేశ్వరుని సమగ్ర రూపం, చైతన్యం, అస్తిత్వం. ఆ సత్యానికి, పారమార్థిక అస్తిత్వానికి, సత్ , చిత్ ఆనందాలకు, సమగ్ర పరివర్తనకు మన చైతన్యం మనస్సు, హృదయం, జీవితం, సంకల్పం, శరీరం సమగ్రంగా ప్రఫుల్లమవడమే సాధనా పద్ధతి.

*

మనలోని సంపూర్ణ అస్తిత్వ యోగం ద్వారా ఆత్మపరమాత్మల సంయోగమే గీతలోని, పూర్ణప్రబోధం. సంకుచితమైన సిద్ధాంతం చెప్పినట్లు కేవలం జ్ఞానమార్గం అనుసరించి అవ్యయ, అక్షర పరబ్రహ్మతో సంయోగం చెందడం మాత్రమే కాదు. కర్మజ్ఞానాలను

సమాధానపరచిన పిమ్మట, కర్మజ్ఞానాలతో పాటు ప్రేమ, భక్తి భావజాలాన్ని గీత ప్రముఖంగా చాటింది. అదే పరమ రహస్యానికి (రాజవిద్య, రాజగుహ్య) అత్యున్నత మార్గం. అక్షరబ్రహ్మతో సంయోగం చెందడం అసలు రహస్యమైతే, అత్యున్నత రహస్యమైతే, అది సంభవం కాదు. ఏదో ఒక చోట, ప్రేమ, భక్తికి గల అంతర్గత ఆధారం కూలిపోతుంది. అక్షరబ్రహ్మతో సంయోగం అంటే, క్షరపురుషుని భావాలన్నీ తుడుచిపెట్టుకొనిపోతాయి. సాధారణమైన, నిమ్నకార్యాచరణలోనే కాకుండా, ఆ కార్యాచరణ మూలాలలో దాని అస్తిత్వం సంభవం చేసే విధానంలో, అజ్ఞాన భూమిక లోని కర్మలలోనే కాకుండా, జ్ఞానభూమికలోని కర్మలలో సైతం సమస్త భావజాలం నశించిపోతుంది. క్షరపురుషుని లీలను సంభవం చేసే భగవంతునికి, జీవాత్మకు మధ్య సమస్థితి, కర్తృత్వంలో గల భిన్నత్వం రద్దయిపోతుంది. క్షరపురుషుని కర్మాచరణ అజ్ఞానసీమలో క్రీడ అవుతుంది. దానిలో దివ్యసత్యపు ఆధారభూమిక కానీ, మూలం కానీ వుండవు. దీనికి విరుద్ధంగా, పురుషోత్తమునితో యోగం ద్వారా సంయోగం చెందడం అంటే, ఆయనతో ఏకత్వం పొంది జ్ఞానం, ఆనందం పొందడం. అయితే మన క్రియాత్మక అస్తిత్వంలో కొంత భిన్నత్వం ఉంటుంది. దివ్యకర్మల లీలలో ఈ క్రియాత్మక అస్తిత్వం కొనసాగుతుంది. దివ్యప్రేమ లక్ష్యశక్తి ఈ దివ్యకర్మల్ని కోరుకొంటుంది. పరిపూర్ణత్వం పొందిన దివ్యప్రకృతితో ఈ దివ్యకర్మలు నిండి వుంటాయి. ఆత్మలో భగవంతుని సిద్ధి పొందడంతో సామరస్యం చెందిన భగవత్ రూప సాక్షాత్కారం అది. విముక్త మానవునికి కర్మాచరణను, భక్తిని సంభవం చేసేది అదే. సంభవమే కాదు అతని పూర్ణ అసిత్త్వ భూమికలో అనివార్యం.

*

గీతాయోగం అంతరాంతర కుహరంలోకి, గీత ప్రబోధం సజీవ కేంద్రంలోకి వెళదాం. పరిమితమైన జీవాత్మ అహంకారం నుండి, నిమ్నప్రకృతి నుండి ఉపసంహరించుకొని నిశ్శబ్ద, సుస్థిర పరబ్రహ్మంలోకి ప్రవేశించడం తొలి సోపానం, తొలి మార్పు మాత్రమే. అది మనకు స్పష్టమైనది. మానవరూపంలోని ఈశ్వరుడ్ని గూర్చి గీత ఎందుకు పదే పదే ప్రబోధించిందో, తాను 'అహం మామ్' అని అత్యంత రహస్యమైన, విశ్వ వ్యాప్తమైన పురుషుడ్నని, సమస్త ప్రపంచాలకు ప్రభువునని, మానవాత్మకు అధినేతను అని, అక్షరమైన స్వీయ అస్తిత్వం కన్నా గొప్పవాడినని, అది ఎల్లప్పటికీ సుస్థిరం,

ప్రశాంతంగా ఉంటుందని, ఈ విశ్వంలోని అంతర్ముఖ, బహిర్ముఖ దృశ్యాలకు అందకుండా శాశ్వతంగా ఉంటుందని మనం తెలుసుకొన్నాం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

భగవంతునితో ఐక్యత : మూడు లక్షణాలు

భగవంతునితో ఐక్యత మూడు విధాలుగా వుంటుంది. తాదాత్మ్యం ద్వారా ఆధ్యాత్మిక సారభూతంగా భగవానునితో ఐక్యత పొందడం. అత్యున్నత దైవ అస్తిత్వంలో, చైతన్యంలో ఆత్మ నివశించడం ద్వారా ఐక్యత పొందడం. భగవంతునితో మన ఉపకరణరూపమైన అస్తిత్వం ఏకత్వం పొందడం, అది భగవంతుని సదృశ రూపం పొంది, చైతన్యవంతమైన ఐక్యత పొందడం. మొదటిది అజ్ఞానం నుండి ముక్తిని పొంది సత్యంతో, శాశ్వతునితో తాదాత్మ్యం చెందడం అదే మోక్షం, సాయుజ్యం. జ్ఞానయోగ లక్ష్యం అది. రెండవది — భగవంతునితో, భగవంతునిలో నివశించడం. అది సామీప్య ముక్తి, సాలోక్య ముక్తి, ప్రేమ, ఆనందయోగం తీవ్ర ఆశారేఖ. మూడవది — భగవంతుని ప్రకృతితో తాదాత్మ్యం చెందడం. భగవంతుడు పరిపూర్ణుడు కాబట్ట అటువంటి పరిపూర్ణత దీని లక్ష్యం. శక్తి, పూర్ణయోగ ఉన్నత లక్ష్యం అది, లేదా దివ్యకర్మల, దివ్యసేవల లక్ష్యం. స్వయం అభివ్యక్తి చెందే భగవంతునితో బహుళ రూప ఐక్యత చెందడంపై ఈ మూడు లక్షణాల సంయుక్త పరిపూర్ణత్వం పూర్ణయోగ పూర్ణ ఫలితం, త్రివిధ మార్గాల లక్ష్యం, త్రివిధ త్యాగ ఫలితం.

సంస్కృత భాషా పదకోశం

సాదృశ్యం: భగవంతుని సదృశమైన

సాలోక్యం: భగవంతునితో ఒకే స్థాయిలో అస్తిత్వపు సరిహద్దు రేఖ కలిగి యుండడం, భగవంతునిలో నివశించడం.

సామీప్యం: సమీపంగా, భగవంతునితో ఆత్మ జీవించడం

సాయుజ్యం: ఆత్మ, పరమాత్మల పూర్ణ తాదాత్మ్యం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

సృష్టి వలయం

ప్రశ్న: మధుమయి మాతా,

వైష్ణవ సాంప్రదాయ కథలలలోను, అనేక మార్మికుల వివరణలలోను, రాధ గురించి వర్ణించినప్పుడు కన్నీళ్ళు, పరితాపము ఉంటాయి. "ఆమె విలపించింది, దైవం రాలేదు, దైవం ఆమెను బాధించాడు..." అంటూ వ్రాస్తారు. దాని అర్థం ఏమిటి? ఆమె సమగ్ర పవిత్రమూర్తి... అయినా... ఎందుకు?

అది ఇంకా మార్గంలోనే ఉండడంవల్ల! ఇంకా ఆ వ్యక్తి మార్గంలోనే ప్రయాణిస్తూ, గమ్యం చేరలేదని అర్థం. వారు ఈ ఎడబాటును చాలా ఎక్కువగా ప్రోత్సహిస్తారు, ఎందుకంటె ఈ మానవ ప్రయాణాన్ని, ఆ మార్గాన్ని వాళ్ళు ఆనందంతో స్వీకరిస్తారు. నీవు ఈ జీవితంలో ఉంటూ, ఈ జీవితపు అనుభవాలని స్పర్శిస్తూ ఉన్నపుడు అన్యోన్యాశ్రయత, నిందాస్తుతి తప్పక నీ అనుభవంలో ఉంటాయని చెప్పాను కదా! వాళ్ళు భగవంతునితో పోరాటాన్ని అతనికి దూరమయ్యామనే భావనను అభిలషిస్తారు, అందులో ఆనందం అనుభవిస్తారు. వాళ్లు మానవచైతన్యంలో ఉండడానికే ఇష్టపడతారు. అయితే ఈ భేదభావంలేని సంపూర్ణ ఐక్యతని పొందినపుడు ఇదంతా కనిపించదు. వాళ్లకి ఆ ఆనందం, ఆ నాటకీయత కోల్పోయి నట్లనిపిస్తుంది. జీవితంలో ఏదో తొలగిపోయిందనే భయం. ఎందుకంటె సత్యాన్ని వాళ్ళు ప్రత్యక్షంగా అందుకోలేరు, వాళ్ళ కింకా కొంత భ్రమ కావాలి.

నిజానికి ఈ ఎడబాటు అన్న భావం తొలగిపోవాలంటె, నీ లోపల ఒక పరిపూర్ణ ఐక్యతను సాక్షాత్కారింపచేసుకోవాలి. ఒక్కసారి ఆ సమగ్ర ఐక్యతను అనుభవంలోకి తెచ్చుకున్నాక, కథ ముగింపుకు చేరుతుంది. ఇంక చెప్పడానికేం మిగలదు.

అందుకే ఈ ప్రపంచం మొత్తం, ఈ సృష్టంతా, దైవంతో సమగ్ర ఐక్యతను అనుభూతం చేసుకుంటే, అప్పుడిక సృష్టి పునరావృతం కానక్కర లేదు. ఆ విధంగానే ఏ భేదభావానికి తావులేని సంపూర్ణ ఐక్యతను నీవు అనుభూతి చెందితే, ఏమాత్రం భేదభావం లేని సమగ్ర ఐక్యతను ఈ విశ్వం సిద్ధింపచేసుకుంటే, అప్పుడింక విశ్వమే ఉండదు. తిరిగి ప్రళయానికి సిద్ధమౌతున్నట్లుంటుంది.

దీనికి పరిష్కారం, ఈ ఇచ్చిపుచ్చుకోడమనే లీలలో ఆనందాన్ని వెతుక్కోడమే. పరస్పర అనుబంధంలోని, ద్వైతభావనని వారు ఆ విధంగానే ఎంచుతారు. లేనపుడు

ఐక్యత సాధించాక ఇక మిగిలేది ఐక్యతే. అక్కడ ఇంక డ్రామా ఉండదు. ఐక్యత సంపూర్ణంగా సమగ్రంగా సాధిస్తే, ఇంకొకటి నిదర్శనంగా చూపించడానికి అక్కడ ఏమీ ఉండదు.

నేను ప్రేమ గురించిన కథ చెప్పినప్పుడు చెప్పాను. చాలా తక్కువమంది ఆ భేదాన్ని గమనించి ఉంటారు. ఏకాత్మ భావలో పొందిన ఆనందంతో, ఈ సృష్టి ప్రారంభమౌతుందని, ఆ సృష్టి యొక్క పూర్ణవృత్తం ముగిసాక, తిరిగి అది ఆనందంలో ఐక్యం చెందుతుందని. సృష్టికి ఆవర్తనం లేనపుడు అక్కడ కలయికలో ఉండే ఆనందం ఎన్నటికీ ఉండదు, అప్పుడు ఏకాత్మభావన మాత్రమే ఉంటుంది. ఆ ఆవర్తనం లేనపుడు అక్కడ ఐక్యత సాధ్యం కాదు.

ఇందులో కొంత సూక్ష్మత ఉంది, కాని ఇది వాస్తవం. ఏకత్వపు భావనలోని ఆనందం, తన పూర్ణ అనుభవాన్ని, తాదాత్మ్యతని, ఆ ఫలాన్ని ఐక్యతలో సిద్ధింప చేసుకోవాలి. అందుకేనేమో పూర్ణ ఆవృత్తం తయారుచేయబడింది.

అదే సంపూర్ణ ఏకాత్మ భావనలో, ఇంక కలయికకు ఆస్కారం లేదు. అక్కడ ఐక్యత చెందాలన్న భావన ఉండదు. ఈ సమగ్ర ఏకత్వంలో దానికి భిన్నమైనది మరొకటి ఉన్నదన్న అర్థాన్ని అది సూచిస్తుంది. సమగ్ర ఐక్యత ఉండగలదు కాని సమగ్ర ఏకత్వభావన ఉండదు.

మాటలతోను, మీ మెదడుతోను దీన్నర్థం చేసుకుందుకు ప్రయత్నించకండి. ఈ రెండు మాటలు పూర్తిగా భిన్నమైన అనుభవాలను వ్యక్తం చేస్తాయి. అయినా దాని ఫలితం ఒక్కటే. అయితే ఒకటి మాత్రం రెండోదానిలో లేని అన్ని సమృద్ధతలని పొంది ఉంటుంది. అదే ఆ అనుభవంలోని సంపూర్ణ అద్వితీయ ఐక్యతావైభవం — సంపూర్ణ విశ్వంతో ఐక్యత పొందిన అనుభూతి.

మూలం: శ్రీమాత (CWM 8:224, 26)

అనువాదం: డి. సత్యవాణి

ఆత్మ జననం వెనుక పరమార్థం

సంకల్పం, జ్ఞానం, ప్రేమలోని మానవప్రకృతి, మానవ జీవితంలోని మూడు దివ్యశక్తులు. మానవాత్మ పరమాత్మ వైపు అధిరోహించడానికి మూడు మార్గాలను అవి సూచిస్తాయి. వాటి పూర్ణత్వం, సమగ్రత, ఆత్మ పరమాత్మల తాదాత్మ్యం — ఇవి పూర్ణయోగం పునాది.

కర్తృత్వం జీవితపు మొదటి శక్తి. ప్రకృతి శక్తితో ప్రారంభిస్తుంది. మనిషిలో స్పృహ పొందినప్పటి నుండి, ప్రకృతి కార్యసరళి సంకల్పంగా, దాని విజయాలుగా మారుతుంది.

తన కార్యసరళిని భగవంతుని వైపు మళ్ళించడంతో అతని జీవితం ఉత్తమరీతిలో, నిశ్చయంగా దివ్యత్వ శోభితమవుతుంది. తొలి ప్రకాశానికి అదే గవాక్షం. ఉపదేశం పొందడానికి ప్రారంభదిశ. తన సంకల్పాన్ని భగవత్ సంకల్పంతో ఒక్కటిగా చేస్తే, మొత్తం కార్యసరళి భగవంతుడున్నుండే ప్రవహిస్తే, భగవంతుని వైపే పురోగమిస్తే, దివ్యకర్మలలో తాదాత్మ్యం పరిపూర్ణంగా కృతకృత్యమవుతుంది. కర్మలు జ్ఞానంలో సాఫల్యం చెందుతాయి. కర్మల సర్వస్వం జ్ఞానంలో పరిపూర్తి పొందుతుందని గీత ప్రబోధించింది. (సర్వం కర్మఖిలం జ్ఞానే పరిసమాప్యతే)

సంకల్పం, కర్మల ఐక్యత ద్వారా, సర్వ పరివ్యాప్త చైతన్యమూర్తిగా ఒక్కటిగా మారతాము. అక్కడ నుండే మన ఇచ్ఛ, కర్మలు ప్రభవించి, తమ శక్తిని పుంజుకుం టాయి. తమ శక్తులన్నీ అందులోనే సాఫల్యం చెందుతాయి. ఈ తాదాత్మ్యానికి కిరీటం ప్రేమ. మనం జీవించే సత్ రూపమైన అస్తిత్వంతో తాదాత్మ్యం చెందడం వల్ల కలిగే ఆనందపారవశ్యమే ప్రేమ. ఆ అస్తిత్వంలోనే మనం కదలుతాం, పనిచేస్తాం. దాని వల్లనే మనం జీవిస్తాం. అస్తిత్వం కోసమే కర్మలు ఆచరించడానికి, ఆ విధంగా మారడానికి మనం ప్రయత్నిస్తాం.

దివ్య స్వీయ ఆనందపు శక్తి కాంక్ష, ప్రేమ. ప్రేమ లేకుండా ఆనందపరవశిత శాంతిని, ఆనందపు ప్రగాఢ నిశ్శబ్ద మహత్వాన్ని పొందగలమేమో. కాని ప్రేమలోని పరిపూర్ణ సుసంపన్నత, నిండుతనాన్ని పొందలేము. విభజనలోని దుఃఖం నుండి, పరిపూర్ణ తాదాత్మ్యంలోని మహానందంలోకి ప్రేమ నడిపిస్తుంది. తాదాత్మ్యపు

ఆనందాన్ని మాత్రం కోల్పోము. ఆత్మ మహోన్నత ఆవిష్కరణ అదే. ఈ విశ్వంలో యుగయుగాల జీవనం అందుకు సన్నద్ధం కావడమే.

*

జ్ఞాన కర్మల మార్గంలో లాగే, ప్రేమమార్గంలోనే పూర్ణయోగ ప్రారంభం అవుతుంది. కాని, అవి ఎక్కడ కలుస్తాయో, అదే సాఫల్య ఆనందానికి నాంది. ప్రేమ నుండి ప్రారంభం కాకపోయినా, అది ప్రేమను పోగొట్టుకోలేదు. కర్మల కిరీటం ప్రేమ. ప్రఫుల్ల జ్ఞాన వికాసమే ప్రేమ.

మూలం: శ్రీఅరవిందులు (CWSA 23:545, 547, 551)

అనువాదం: కె. యజ్ఞన్న

నీ సాన్నిధ్యాన్ని అనుభవిస్తున్న తరుణమిది

ఓ ప్రభూ! హఠాత్తుగా నీ ముందు నా గర్వమంతా అణిగింది. నీ సమక్షంలో, నన్ను నేను అధిగమించాలని ఆశపడటం ఎంత వ్యర్థమైన పనో నా కర్థమైంది.

ఇప్పుడు నీకు ఎంతో చేరువైనట్టు అనుభూతి చెందుతున్నాను. ఎంత చేరువలో ఉన్నానంటే, నా శరీరమంతా ఆనందంతో పులకరిస్తోంది.

నీ ముందు నిలిచి నాకున్న అల్పజ్ఞానంతో వేడుకుంటున్నాను.

"ఓ సర్వజ్ఞుడా! ఓ ఏకైక ఆంతరంగికుడా! మేం విశ్వసించగల ఒకే ఒక్కడివి, మేం ఏం చెప్పబోతున్నామో నీకు ముందుగానే తెలుసు, ఎందుకంటే వాటి మూలాధారం నువ్వే కదా!

"ఓ సర్వోత్తమా! మా ఏకైక దివ్యసఖా! మా కున్న ఒకే ఒక సఖుడవు. మమ్మల్ని ఈ విధంగా రూపొందించినది నీవే, అందుకే మమ్మల్ని యథాతథంగా స్వీకరిస్తావు, ప్రేమిస్తావు, అర్థం చేసుకుంటావు.

"ఓ సర్వాంతర్యామీ! మా ఏకైక దివ్యమార్గదర్శకుడా! మా లోని ఉన్నత సంకల్పాలను నీవు కాదనవు, ఎందుకంటె మాలో ఉండి సంకల్పించినది నీవే కదా!

మేం చెప్పేది వినడానికి ఎల్లవేళలా సంసిద్ధుడవై ఉంటావు, మా పిలుపు విని ప్రేమతో మార్గదర్శకుడివై నడిపిస్తావు, మా ప్రార్థనలను ఎన్నడూ నిష్ఫలం కానివ్వవు,

అలాంటి నిన్ను వదిలి అన్యుడిని ఆశ్రయించుటకు ఎక్కడో వెతుక్కోవడం మా పొరపాటు.

ఆ సర్వజ్ఞుడిని, సమగ్రమైన విశ్వాసంలోని ఉన్నతానందాన్ని, సంపూర్ణమైన ప్రశాంతతను, నిస్వార్థమైన, నిష్కళంకమైన, నిరాటంకమైన, అప్రయత్నంగా సమకూరిన సంపూర్ణ సమత్వ ఆనందాన్ని తెలుసుకునే విధంగా నన్ను మలిచావు.

ఓ నా ప్రియసఖా! నీ ముందు ఆనందంతో పసిబిడ్డవలె ఒకేసారి నవ్వుతూ, దుఃఖిస్తూ నిలిచాను.

మూలం: శ్రీమాత

అనువాదం: డి.సత్యవాణి

దైనందిన జీవనానికి శ్రీమాత సలహాలు

సదా దైవసన్నిధి యందున్నట్లుగా జీవించు. అతడి ఉనికే నిన్ను నడుపుతూ, నీ ద్వారా అన్ని పనులు చేయిస్తోందన్న భావనను సదా నీలో నిలుపుకో. నీలోని అన్ని కదలికలు అతడికి సమర్పించు, ఒక్క మనోవ్యాపారమే కాదు, ప్రతి ఆలోచన, ప్రతి సంవేదనతో పాటు, అత్యంత సామాన్యమైన బాహ్య క్రియాకలాపాలు కూడా సమర్పించు. అంటే నీవు భోజనం చేస్తున్నావనుకో, అప్పుడు ఆ దైవం కూడా నీ ద్వారా ఆ భోజనాన్ని ఆరగిస్తున్నాడని భావించుకోవాలి....

పూర్ణయోగంలోని సమగ్ర జీవనంలో, అత్యంత చిన్న విషయాలు కూడా పరివర్తన చెందాలి. అప్పుడే అది దివ్యజీవనంగా మారుతుంది. ఇక్కడ విలువ లేనిది ఏదీ లేదు. పట్టించుకోరానిది ఏదీ లేదు. ప్రత్యేక సమయం అంటూ ఏదీ లేదు, ఉదాహరణకి "నేను ధ్యానం చేస్తున్నప్పుడు, లేదా నేను తత్వశాస్త్రం చదువుతున్నప్పుడు, లేదా సంభాషణలు వింటున్నప్పుడు మాత్రమే నేను ఆ దివ్యప్రకాశానికి తెరుచుకుని ఉంటాను, దాన్ని ఆహ్వానిస్తాను, కాని నేను స్నేహితుల్ని కల్సినపుడు, నడవడానికి వెళ్లినపుడు, దాని విషయం పూర్తిగా మర్చిపోయినా ఫరవాలేదు" అని నీవు చెప్పడం కుదరదు.

ప్రశ్న: మనం మనోవ్యాపారంలో మునిగి ఉన్నపుడు, మేధస్సుతో జ్ఞానం

కోసం అన్వేషిస్తున్నప్పుడు, కొన్నిసార్లు దైవాన్ని మర్చిపోవడం కాని, ఆ దైవస్పర్శను కోల్పోవడం కాని జరుగుతుంది. ఎందుకని?

నీవు ఆ స్పర్శను కోల్పోవడానికి నీ చైతన్యం ఇంకా విభజించబడి ఉండడం కారణం. నీ మనస్సులో ఆ దైవం ఇంకా స్థిరపడలేదు. నీవు సంపూర్ణంగా, నీలోని సర్వాన్ని సమగ్రంగా దివ్యజీవనసరళికి అంకితం చేయడం లేదు. లేకపోతే నీవు ఏ విషయాల మీద మనసు లగ్నం చేసినా, నీకు దైవం నించి సహాయం చేయూత దొరుకుతుందన్న భావన నీలో కొనసాగుతుంటుంది.

యోగం ప్రారంభించినపుడు తరచుగా నీవు దైవాన్ని ఆ ఉనికిని విస్మరించుట మామూలుగా జరుగుతుంది. కాని నిరంతరం ఆకాంక్షతో నీవు నీ స్మరణను పెంచుతూ, ఈ మర్చిపోవడాన్ని తగ్గించుకోగలవు. కాని ఏదో కఠినమైన బాధ్యత వలె, శిక్షణ వలె చేయకూడదు. అది ప్రేమ, ఆనందాలతో కూడిన దివ్యగమనం కావాలి.

మూలం:శ్రీమాత (CWM 3:23-26)

అనువాదం: డి. సత్యవాణి

కృష్ణ

ఈ భయానక, సుమధుర ప్రపంచంలో
నా ఆత్మ జననానికి పరమార్థ మేమిటో
చివరికి తెలుసుకున్నాను.
ఈ భూమి క్షుధాగ్ని తప్త హృదయం —
స్వర్గాని కావల మెరిసే వినీల కృష్ణుని
పాదాలను ఆరాధిస్తున్న భావన నాలో మెదిలింది.

అమృత నేత్రాల అలౌకిక సౌందర్యం చూశాను.
ప్రణయేశ్వరుని వేణునాదంలో
మనోహర ఆకాంక్ష స్వరాలు విన్నాను.
అంతం లేని ఆనంద సంభ్రమాన్ని తనివితీరా అనుభవించాను.

నా గుండెలోని ఆవేదన మూగదై పోయింది.

ఆ భువన మోహన సంగీత సుధాస్రవంతి చేరువగా,
మరింత చేరువగా ప్రవహిస్తోంది; పరవశిస్తోంది.
వింత సుఖంతో జీవితం జలదరిస్తోంది.
సర్వప్రకృతి తన ప్రభువును స్పృశించాలని, కౌగలించు
కోవాలని, ప్రభువు రూపమై భాసించాలని ఆశపడుతున్నది,
ప్రకృతి అంతా సువిస్తార ప్రేమాస్పద సమాకర్షిత విరామం.

ఈ అద్భుత క్షణం కోసమే యుగాలన్నీ జీవించాయి.
చివరికి ఈ ప్రపంచం ఇప్పుడు నాలో దివ్య
సాఫల్యమై పరిస్పందిస్తున్నది.

మూలం : శ్రీఅరవిందులు (CWSA 2:608)

అనువాదం: కె. యజ్ఞన్న

Statement about ownership and other particulars concerning Akhila – Akhila Bharata Patrika

Form IV

(1) *Place of publication:* Sri Aurobindo Society, 66, Rue Manakula Vinayagar Covil, Puducherry - 605 002; (2) *Periodicity of publication*: Monthly; (3) *Printer's name, nationality and address*: Swadhin Chatterjee, Indian, Sri Aurobindo Ashram Press, Puducherry - 605 002; (4) *Publisher's name, nationality and address*: Pradeep Narang, Indian, Sri Aurobindo Society, 66, Rue Manakula Vinayagar Covil, Puducherry - 605 002; (5) *Editor's name, nationality and address:* A. Kailasapathi, Indian, Plot No. 25, Door No. 5-7-23, B. N. Reddy Colony, Behind Vanasthalipuram, R. R. District, Hyderabad - 500 070 (AP); (6) *Name and address of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital*: Sri Aurobindo Society, 66, Rue Manakula Vinayagar Covil, Puducherry - 605 002.

I, Pradeep Narang, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd

1 March 2012 — Pradeep Narang